
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యమేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com
Published from mahabub nagar సంపుటి :25 సంచిక :09 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు ఆదివారం 17 మే 2026 పేజీలు :12 వెల రూ5 /-


## మహిళల ఆర్థిక స్వావలంబనకు
# స్త్రీనిధి బలమైన వేదిక

### ప్రజాభవన్లో ఘనంగా స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం: మంత్రి సీతక్క



**హైదరాబాద్:**ప్రజాభవన్లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక (ూాఅఅబఝుశ్రీ ాూఞ్కఅశీఅ ూాశ్రీఖఅ) అమలు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ దాన కిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎండీ శ్రీనాథ్, స్త్రీనిధి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్త్రీనిధి ఉద్యోగులంతా కలిసి స్త్రీనిధి స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ను ఏర్పాటు చేసుకోగా, మంత్రి సీతక్క అభినందించారు. సంఘం ఉద్యోగులను ఐక్యం చేయడమే కాకుండా, హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ప్రయోజనాలతోపాటు లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, "రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించింది. స్త్రీనిధి సంస్థ మన ఇల్లు లాంటిది. సంస్థను కాపాడుకుంటేనే ఉద్యోగుల హక్కులు, భవిష్యత్తు సురక్షితంగా ఉంటాయి" అన్నారు. 2011లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీనిధి, నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలను ఆదుకోవడానికే స్త్రీనిధి ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు - మిగతా3లో

## పెట్రోల్
# భారం...
### రోజువారీ వస్తువులపై ప్రభావం




**హైదరాబాద్, మే 16:**పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో వాహనదారులపై భారం పడింది. లీటరు పెట్రోల్‌పై రూ. 3.14, డీజిల్‌పై రూ. 3.11 చొప్పున పెంచుతూ చమురు కంపెనీలు తీసుకున్న అమల్లోకి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు అంతరాయం, ఖర్చులు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా మారింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గత 11 వారాలుగా ఇంధన ధరలను పెంచకుండా స్థిరంగా కొనసాగించాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక చివరకు సామాన్యులపై ఈ భారాన్ని మోపక తప్పలేదని కంపెనీలు పేర్కొన్నాయి. గత కొంతకాలంగా ఏ పెరుగుదల గురించి అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారో అదే జరిగింది. వాస్తవానికి 2022 ఏప్రిల్ నుంచి ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మాత్రం లీటరుకు రూ. 2 చొప్పున కేంద్రం తగ్గించింది. ఇటీవల అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా దేశంలో పెట్రో ధరలు పెరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం - మిగతా3లో

## మొత్తం మహిళా లోకాన్నే అవమానిస్తున్నారు: కవిత

**అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న కవిత**
**సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్**



ఉద్యమకారులను గుర్తించే కమిటీలో మహిళకు స్థానం లేకపోవడంపై విమర్శ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతూ తీవ్ర విమర్శలు గుప్పించారు. జూన్ 2న జరిగే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల వేదికగానే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, అలాగే అమరవీరుల కుటుంబాలకు సమరయోధుల పెన్షన్లు అందించే ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ప్రభుత్వం వేసిన ప్రత్యేక కమిటీలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించకపోవడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఉద్యమంలో క్రియాశీలంగా పోరాడిన సమస్త మహిళా లోకాన్ని అవమానించడమేనని మండిపడ్డారు. కేవలం కమిటీలతో కాలయాపన చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటేనని, ఒకవేళ జూన్ 2 లోపు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టకపోతే ఉద్యమకారుల సంఘాలతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కేబినెట్
# రీ లోడింగ్ టెన్షన్...




**హైదరాబాద్, మే 16:**తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్‌ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి. ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా - మిగతా3లో

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి...

**కేటీఆర్**



**హైదరాబాద్:**తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ పైన దిశానిర్దేశం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది.

## గులాబీ మిషన్
# 2028..




**హైదరాబాద్, మే 16:**తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా 23 మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది. కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు. దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న - మిగతా3లో

## తెలంగాణలో
# 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'..




- జూన్ 15 నుంచి ప్రక్రియ షురూ
- జూన్ 25 నుంచి జులై 24 వరకు వెరిఫికేషన్ ప్రక్రియ
- ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు
- జులై 31న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ విడుదల
- జులై 31-ఆగస్టు 30 మధ్య అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా

తెలంగాణలో వచ్చే నెల 15 నుంచి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియకు సంబంధించిన వివరాలను శనివారం ఆయన మీడియాతో పంచుకున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు అధికారులు, బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఇస్తారని సుదర్శన్ రెడ్డి వివరించారు. ప్రతి ఓటర్‌కు రెండు ఫామ్‌లు అందుతాయన్నారు. అందులో ఒకటి నింపి తిరిగి బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రెండో ఫామ్‌ను ఓటరు తమ వద్దే అక్‌నాలెడ్జ్‌మెంట్ కింద ఉంచుకోవచ్చని - మిగతా3లో

## కోట్లాది మంది భారతీయుల
# నమ్మకం నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..



**ఢిల్లీ:** భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి - మిగతా3లో

## సంపాదకీయం

# ఎన్నాళ్లీ లీకులు

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాసిక్ వైద్యుడు డాక్టర్ శుభం ను సిబిఐ అధికారులు అరెస్ట్ చేశారు. విచారిస్తున్న క్రమంలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. శుభం వైద్యుడిగా కొనసాగుతున్నాడు. కానీ ఒక్కరోజు కూడా మెడికల్ కాలేజీకి వెళ్లలేదు. ఇతడి స్వస్థలం నందగావ్. ఇతడు నాసిక్ ప్రాంతంలో కోచింగ్ కారిడార్ ప్రాంతంలో ఎస్సార్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. దాని నేమ్ బోర్డు లో శుభం పేరు ముందు డాక్టర్ అని రాసి ఉంటుంది. స్థానికంగా అతడు తనను తాను డాక్టర్గా పరిచయం చేసుకున్నాడు. అంతేకాదు ఎంబిబిఎస్, బిడిఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రయత్నాల సాగించే విద్యార్థులకు అతడు సలహాలు ఇస్తుంటాడు. 2021లో భోపాల్ సమీపంలోని సత్యసాయి యూనివర్సిటీలో బ్యాచ్లర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సు ఇతడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అయితే పోలీసులు విచారణలో ఆ యూనివర్సిటీ వీసీని సంప్రదించారు. అప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేవలం అడ్మిషన్ సమయంలోనే శుభం యూనివర్సిటీ కి వెళ్ళాడు. ఆ తర్వాత తరగతులకు హాజరు కాలేదు.నీట్ క్వశ్చన్ పేపర్ లీకేజీ వ్యవహారం ముందుగా రాజస్థాన్లో వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత విచారణ జరుగుతున్న కొద్ది అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ ను శుభం పదిలక్షలకు కొనుగోలు చేశాడు. కొరియర్ లో ప్రశ్నపత్రం వస్తే.. దానిని పిడిఎఫ్ లాగా మార్చాడు. ఆ తర్వాత దానిని గురుగ్రామ్ ప్రాంతంలో ఒక వ్యక్తికి 15 లక్షలకు అమ్మాడు. ఈ పేపర్ మొత్తం అనేక రాష్ట్రాలను చుట్టింది. పలువురు విద్యార్థులు రెండు నుంచి ఐదు లక్షల వరకు వెచ్చించి కొనుగోలు చేశారు. అయితే క్వశ్చన్ పేపర్ లీకేజీ బయటపడడంతో.. శుభం పరారీ లో ఉన్నాడు. తర్వాత తనను ఎవరు గుర్తుపట్టకుండా ఉండడానికి గుండు చేయించుకున్నాడు. అయితే పోలీసులు డిజిటల్ ఆధారాలు సేకరించి అతడిని అరెస్ట్ చేశారు. శుభం సోదరుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ అనేది ఈ పరీక్ష రాసిన విద్యార్థుల గుండెల్లో దిగి న బాకు మాత్రమే కాదు, లక్షలాది జీవితా ల్లో ఒక్కసారిగా వెలుగు ఆరిపోవడం లాంటి ది కూడా. నెలల తరబడి కాదు, ఏళ్లుగా నిద్ర మానేసి, ఫోన్లు దూరం పెట్టి, పండుగలు వదిలేసి, తమ యౌవనాన్ని ప్రశ్నాపత్రాల మధ్య బంధించిన పిల్లలకు పరీక్ష రద్దు అనే రెండు మాటలు వార్తలా వినిపించవు. అవి గుండెలమీద పడే బరువులా అనిపిస్తాయి.పాపం, పుణ్యం తెలియకుండా కష్టాన్ని మా త్రమే నమ్ముకొని ఈసారి బాగా రాశామని, మంచి ర్యాంకు వస్తుందని ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు ఇప్పుడు మళ్లీ సందిగ్ధంలో పడ్డారు. విద్యార్థుల కంటే ఎక్కువగా వారి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతు న్నారు. పైసా పైసా కూడబెట్టి పిల్లలను చదివించారు. కొందరు బంగారం అమ్మారు. మరికొందరు పొలాలు తాకట్టు పెట్టారు.మధ్యతరగతి కుటుంబాల్లో డాక్టర్ అవ్వాలనే కల ఒక వృత్తిపై ఆశ మా త్రమే కాదు. అది ఒక తరాన్నే మార్చే ఆశ యం. ఇప్పుడు వారిని వెంటాడుతున్నది పరీక్ష రద్దయిందనే బాధ మాత్రమే కాదు, మళ్లీ అదే స్థాయిలో రాయగలమా? అనే భ యం కూడా. ఒక పరీక్షను మళ్లీ నిర్వహించడం సాధ్యమే కావచ్చు. కానీ, ఒకసారి విరి గిపోయిన మనసును తిరిగి అదే ధైర్యంతో నిలబెట్టడం అంత సులభం కాదు.పేపర్ లీక్ అయిందని, నిర్వహణలో లో పాలు జరిగాయని, అవకతవకలపై అనుమానాలు వచ్చాయని అధికారిక కారణాలు విని పించవచ్చు. కానీ, ఇక్కడ అసలు ప్రశ్న ఇం కొకటి ఉంది. దేశంలో అత్యంత కీలకమైన పరీక్షలలో ఒకటైన నీట్ను కూడా నిజాయితీగా, పారదర్శకంగా నిర్వహించలేకపోతే వి ద్యార్థులు ఇంకేం నమ్మాలి? పరీక్షల మీద నమ్మకం కూలిపోవడమనేది కేవలం విద్యావ్యవస్థ సమస్య కాదు. అది సమాజ నైతికత కదలిపోతున్నదని చెప్పడానికి సంకేతం.ఎందుకంటే పరీక్షలు కేవలం మార్కులు ఇ వ్వవు. నువ్వు కష్టపడితే ముందుకు వెళ్లగలవనే విశ్వాసాన్ని కూడా ఇస్తాయి. ఇప్పుడు అ దే విశ్వాసం ముక్కలవుతోంది. దేశవ్యాప్తం గా ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నారు. వారిలో చాలా మంది సాధారణ కుటుంబాల నుంచి వచ్చినవారే. వాళ్లకు ప్రతిభ ఒక్కటే మూలధనం.కానీ, ఇప్పుడు ఎక్కడో, ఎవరో వ్యవస్థను మోసం చేస్తే తన కష్టం వృథా అవుతుందా? అనే భయం పెరుగుతోంది. ఇది ఏ విద్యార్థికైనా అత్యంత ప్రమాదకరమైన మానసిక స్థి తి. ఎందుకంటే ఆశ కోల్పోయిన యువత ఇ చ్చే నిశ్శబ్దం కన్నా భయంకరమైనది మరొకటి ఉండదు.నీట్ చుట్టూ ఇప్పుడు మరో పెద్ద ప్రశ్న నిలుస్తోంది. కోట్లాది విద్యార్థుల భవిష్యత్తును ఒకే రోజు, ఒకే పరీక్షతో నిర్ణయించడం నిజంగా న్యాయమేనా? ఒక గ్రామంలో తె లుగు మీడియంలో చదివిన విద్యార్థి, అత్యం త ఖరీదైన కోచింగ్ తీసుకున్న నగర విద్యార్థితో ఒకేస్థాయిలో పోటీ పడుతున్నాడని చెప్పడం సులభం. కానీ, వాస్తవ పరిస్థితులు అంత సమానంగా లేవు. ఒకరికి టెస్ట్ సిరీస్లు, ప్రత్యేక శిక్షణ, డిజిటల్ సదుపాయా లు ఉంటే, మరొకరికి కనీసం సరైన విద్యుత్ సదుపాయం కూడా ఉండకపోవచ్చు.అయినా ఇద్దరికీ ఒకే మెరిట్ కొలమానం వర్తింపజేయడం నిజంగా సమానత్వమేనా? మెరిట్ అనే పదం వినడానికి గొప్పగా ఉంటుంది. కానీ ఆ మెరిట్ వెనుక కుటుంబ పరిస్థితి ఏమిటి? ఆర్థిక స్థితి ఏమిటి? అవకాశాలు ఎంతవరకు అందుబాటులో ఉన్నాయి? అ నే ప్రశ్నలూ ఉంటాయి. కొందరు కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో లక్షలు ఖర్చు చేసి సిద్ధమవుతుంటే, మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వనరుల మధ్య చదువుతు న్నారు. పరీక్ష అందరికీ ఒకటే కావచ్చు. కానీ, అవకాశాలు మాత్రం అందరికీ ఒకేలా లేవు.నీట్ వంటి పరీక్షలు వచ్చిన తర్వాత విద్య అంటే జ్ఞానం అనే భావన క్రమంగా బలహీనపడుతోంది. ఇప్పుడు చాలామంది విద్యా ర్థులు పాఠాన్ని అర్థం చేసుకోవడానికి కాదు, ప్రశ్నకు సరైన సమాధానం గుర్తుపెట్టుకోవడానికి మాత్రమే చదువుతున్నారు. పాఠశా లలు విద్య నేర్పే స్థలాలుగా కాకుండా, పరీక్షలకు సిద్ధం చేసే గదులుగా మారిపోతున్నా యనే విమర్శలు పెరుగుతున్నాయి. కోట్ల రూపాయల కోచింగ్ పరిశ్రమ విద్యార్థుల ఆశలను మాత్రమే కాదు, వారి భయాలను కూడా వ్యాపారంగా మార్చేసిందిఉదయం నుంచి రాత్రి వరకు టెస్టులు, ర్యాంకులు, పోలికలు, ఒత్తిళ్లు... ఇవన్నీ కలిసి విద్యార్థి బాల్యాన్ని మెల్లగా మింగేస్తున్నాయి. డాక్టర్ కావాలనే కల ఇప్పుడు చాలామందికి సేవాభావం కంటే బతుకుపోరాటంగా మారిపో యింది. ఈ వ్యవస్థలో పిల్లలు చదువుకుం టూ పెరగడం లేదు. కేవలం ఒత్తిడి మధ్య పెద్దవాళ్లు అవుతున్నారు.

నీట్ గురించి మాట్లాడేటప్పుడు మనం మార్కులు, ర్యాంకులు, సీట్ల గురించి ఎక్కువగా మాట్లాడతాం. కానీ, విద్యార్థుల మాన సిక ఆరోగ్యం గురించి చాలా తక్కువగా చర్చిస్తాం. ఒక విద్యార్థి సంవత్సరాల కష్టం ఒక్క పరీక్షపై ఆధారపడినప్పుడు, అతని మనసులో భయం కలగడం సహజం. 'ఫలితం రాకపోతే నా విలువ ఏమిటి?' అనే ప్ర శ్న చాలామంది పిల్లల్ని కుంగదీస్తోంది. బ యటికి కనిపించేది చదువు మాత్రమే.కానీ వారు తమ మనస్సులలో ఒంటరితనం, ఆందోళన, నిరాశతో కూడిన యుద్ధం చేస్తున్నారు. పరీక్ష రద్దు వార్త వచ్చిన క్షణంలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేసి ఉండొచ్చు. కొందరు ఏడ్చి ఉండొచ్చు. కానీ, ఇంకా ప్రమాదకరమైన స్పందన మరొకటి ఉంది. అది నిశ్శబ్దం. ఎందుకంటే చాలామంది పిల్ల లు ఇప్పుడు అలసిపోయారు; కేవలం చదువుతో కాదు, నిరంతర ఒత్తిడితో. ఇప్పుడు చేయాల్సింది మళ్లీ పరీక్ష నిర్వహించడం మాత్రమే కాదు. ముందుగా విద్యార్థుల నమ్మకాన్ని తిరిగి నిర్మించాలి. తప్పు ఎక్కడ జరిగిందో స్పష్టంగా చెప్పాలి. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. విచారణలు పారదర్శకంగా జరగాలి. ఎందుకంటే రహస్యంగా జరిగే విచారణలు అనుమానాలను మరింత పెంచుతాయి. పరీక్షా నిర్వహ ణ వ్యవస్థను సాంకేతికంగా మరింత భద్రం గా మార్చాలి. ప్రశ్నాపత్రాల రవాణా నుంచి పర్యవేక్షణ వరకు ప్రతి దశలో డిజిటల్ ట్రాకింగ్ ఉండాలి.అంతకంటే ముఖ్యంగా, ఒకే పరీక్షతో జీవితాన్ని నిర్ణయించే విధానం గురించి దేశవ్యాప్తంగా పెద్ద చర్చ ప్రారంభం కావాలి. స్కూల్ విద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలా? బహుళ దశల మూల్యాంకనం అవసరమా? రాష్ట్ర విద్యావ్యవస్థల పాత్ర పెరగాలా? అనే ప్రశ్నలపైనా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.విద్యార్థులకు ప్రత్యేక మద్దతు, స్థానిక భాషల్లో నాణ్యమైన వనరులు అందుబాటులోకి రావాలి. అలాగే ప్రతి కీలక పరీక్ష తర్వాత విద్యార్థులకు, తల్లిదండ్రులకు మానసిక కౌన్సెలింగ్ సపోర్ట్ కూ డా అవసరం. ఎందుకంటే పిల్లలు విఫలమవుతున్నది చదువులో కాదు, ఒత్తిడిని ఒం టరిగా మోయడంలో.దేశ భవిష్యత్తు పరీక్షా హాళ్లలో కూర్చు న్న ఆ పిల్లల చేతుల్లోనే ఉంది.

## నీట్ లీక్ ఎఫెక్ట్...
# అన్నీ పరీక్షలపై ప్రభావం

**హైదరాబాద్, మే 16:**నీట్ కౌన్సెలింగ్ తర్వాతే పలు ఇతర కోర్సుల ప్రవేశాలు జరపాల్సి ఉండటంతో యేటా విద్యా సంవత్సరం గాడి తప్పుతోంది. ఈ క్రమంలో ఈఏపీసెట్ ఫలితాలు మే నెలలోనే వెలువడినా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు వరకు వేచి చూడాల్సి వస్తోంది. అన్ని పరీక్షలు సకాలంలో పూర్తయితేనే ఈఏపీసెట్ పరిస్థితి ఇలా ఉంది. ఇక ఈ ఏడాది నీట్ పరీక్ష రద్దు అవడంతో పలు ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.గత ఏడాది మే 4న నీట్ నిర్వహించగా.. జూన్ 14న ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా నీట్ ర్యాంకు ఆధారంగా రాష్ట్ర ర్యాంకు కేటాయిస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ మొదలవుతుంది. రాష్ట్ర నీట్ కౌన్సెలింగ్ రెండు, మూడు దఫాలు పూర్తయిన తర్వాత ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగం ప్రవేశాలు మొదలుపెడుతుంది. కాళోజీ హెల్త్ వర్సిటీల




ఆధ్వర్యంలో తొలుత నీట్ కౌన్సెలింగ్ ఆ తర్వాత వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతారు. చివరగా బీఫార్మసీ, ఫార్మా–డి కౌన్సెలింగ్ మొదలవుతుంది. గత ఏడాది నీట్ సవ్యంగా జరిగితేనే ఫార్మా కౌన్సెలింగ్ అక్టోబరు 5న మొదలైంది. చివరి విడత కౌన్సెలింగ్ అక్టోబరు 23తో పూర్తయింది. ఈ సారి నీట్ రద్దు కావడంతో ఈ ప్రవేశాలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక బీ ఫార్మసీ, ఫార్మా–డి కోర్సులకైతే నవంబరు వరకు ప్రవేశాలకు ఎదురు చూడాల్సిందే.ఈ కౌన్సెలింగ్లు అన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండటంతోనే ఈ జాప్యం నెలకొంటుంది. ఒక కోర్సులో చేరిన తర్వాత డిమాండ్ ఉన్న మరో కోర్సులో సీటు వస్తే.. తొలుత సీటు పొందిన కాలేజీలు ఫీజు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆ ఫీజును వదులుకోవడమో.. మెరుగైన సీటు కోల్పోవడమో జరుగుతుంది. అందుకే విద్యాశాఖ అధికారులు సైతం ఒక కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మరొకటి నిర్వహిస్తున్నారు. ఈసారి మళ్లీ నీట్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించడానికి కనీసం 2 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారంగా చూస్తే ప్రవేశాల కౌన్సెలింగ్లు మరింత ఆలస్యమవుతాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే తప్ప కొత్త విద్యాసంవత్సరం కొలిక్కిరాదని నిపుణులు భావిస్తున్నారు.

# పవన్ కు ఇన్ని ఆరోగ్య సమస్యలా

**గుంటూరు, మే 16:**సైనస్ ఆపరేషన్ కారణంగా గత కొంత కాలం నుండి విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ , నేడు తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. జనసేన పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఆయన , నేడు మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా అంతటా బాగా వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఉద్యమి సభ్యత్వాలను అత్యధిక శాతం చేయించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించాడు. ఇదంతా పక్కన పెడితే , తన ఆరోగ్య పరిస్థితి పై పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురి చేస్తోంది. ఇన్ని సమస్యలను పెట్టుకొని ఒక పక్క సినిమాలు , మరోపక్క రాజకీయాలు ఎలా మ్యానేజ్ చేస్తున్నావ్ అన్నా అని ఆయన అభిమానులు సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ పవన్ కళ్యాణ్ ఏమి మాట్లాడాడో ఒకసారి చూద్దాం.ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి నా ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఎన్నికల సమయం లో బాగా తిరగడం తో పాటు , నాకు కరోనా వచ్చినప్పుడు ఏర్పడిన లంగ్ ఇన్ఫెక్షన్ అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత దుమ్ము , ధూళి లో తిరగడం వల్ల , సైనస్ ప్రాంతాల్లో ఆ డస్ట్ బాగా గట్టి పడింది, అది కాలక్రమేణా వాచిపోయేలా చేసింది. ఆ కారణం చేత ఒక రోజు నా కళ్ళు కనిపించకుండా పోయింది. ఈ కారణాల చేత భీమవరం లో ఒక ప్రోగ్రాం ఉన్నప్పటికీ క్యాన్సిల్ చేసి , హైదరాబాద్ కి వెళ్ళి , ఇవన్నీ సరిచేసుకొని రావడానికి ఒక నెల రోజుల సమయం పట్టింది. డాక్టర్లు నా రెండు భుజాల మధ్య కూడా టెర్ వచ్చేసిందని అన్నారు. ఎందుకు ఇలా వచ్చింది అని డాక్టర్లు అడగ్గా, క్యాంపైన్ కి వెళ్ళినప్పుడు అభిమానులు చేతులు పట్టుకొని లాగేస్తుంటారు , కన్దతెగిపోయేంత లాగేస్తారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ని మీకోసం క్రింద అందిస్తున్నాము



చూడండి. ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ కి ఎలాంటి ఆరోగ్య సమస్య లేదు అనేది స్పష్టమైంది , రాబోయే రోజుల్లో ఆయన సినిమాలను , రాజకీయాలను ఎలా బ్యాలన్స్ చేస్తాడో చూడాలి.

# పెట్రోల్ వినియోగం లో గోవా టాప్...

**హైదరాబాద్, మే 16:**అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024--25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినయోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు. ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్ల వినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది.చిన్న రాష్ట్రాల్లో




టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణ--ఆంధ్రల్లో మిక్స్డ్ ఎకానమీ (2--వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక, పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హై--కనరీ?స్యమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ--స్మార్ట్ నేషన్గా మారుతుంది.

# డాలర్ స్థానంలో బ్రిక్స్ ...

ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్లో మెంబర్షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది.బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి.ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని ధీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న




కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి,

దేశాలన్నీ బ్రిక్స్ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ-7 (+7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్ం) వైపు ఆశగా చూస్తోంది. ఈ అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్ లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ-బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

# బండి సంజయ్ తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలి...

## ఆయనకు సహాయం చేయాలనుకుంటే పోక్సో కేసు పెట్టం కదా:సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:**కుమారుడి విషయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ తీరు నైతికంగా తప్పు అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన తన కుమారుడిని స్వయంగా తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాలని సూచించారు.కుమారుడి తప్పిదం వల్ల సంజయ్‌కు తలవంపులు వచ్చాయన్నారు.సంజయ్ ధైర్యంగా నిలబడి విచారణ ఎదుర్కోవాలి తప్ప పారిపోకూడదన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలపై జరుగుతున్న నేరాలను నియంత్రించామని సీఎం చెప్పారు. ఈ నెల 8 రాత్రి మైనర్ బాలిక తల్లి పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు ఇచ్చారని, 9న విచారణ ప్రారంభించి సెక్షన్లు మార్చి కేసు నమోదు చేసినట్లు వివరించారు. ప్రధాని మోదీ పర్యటనకు భద్రత కోసం 10 వేల మంది పోలీసులు పనిచేశారని, పర్యటన ముగిసిన తరువాత 11వ తేదీన సెక్షన్లు సవరించి వెంటనే నోటీసులు జారీ చేశారని తెలిపారు. సంజయ్ కుమారుడి ఫిర్యాదు, అమ్మాయి తల్లి ఫిర్యాదును బేరీజు వేసుకుని..అమ్మాయి స్టేట్‌మెంట్‌ను తీసుకొని పోలీసులు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం తొందరపడి ఉంటే వెయ్యి మంది



పోలీసులతో ఇంటిమీద పడ్డారంటూ అంతా విమర్శించే వారని అన్నారు. మైనర్ బాలిక కేసులో ఎటు పడితే అలా చేయడానికి వీల్లేదన్నారు.బండికి సహాయం చేయాలంటే పోక్సో కేసు పెట్టం కదా,పోక్సో కేసు పెట్టామంటేనే మా కమిట్మెంట్ ఏంటో తెలుస్తుంది కదా అని సీఎం వ్యాఖ్యానించారు.బండి సంజయ్, బీఆర్ఎస్ మధ్య ఎక్కడ చెడిందో తనకు తెలియదన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనాన్ని వ్యతిరేకించడం వల్లనే సంజయ్‌పై కేటీఆర్ కోపంతో ఉన్నట్లున్నారని వ్యాఖ్యానించారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పుడు పోలీసు ఆఫీసర్ కాదని గుర్తుంచుకోవాలన్నారు. పోక్సో కేసు పెడితే బెదిరించినట్లా? లేక బాధితురాలి పక్షాన ఉన్నట్లా? అని ప్రశ్నించారు. డిసెంబరుకు ముందు జరిగిన ఘటనపై ఫిర్యాదు వచ్చిందని, 4 నెలలు వెనక్కి వెళ్లి అప్పటి ఘటనలను విచారించాలంటే సమయం పడుతుందని చెప్పారు. నోటీసులపై స్పందించకపోతే పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. తనను జైల్లో పెట్టిన కేసీఆర్ కుటుంబం పట్ల తాను కఠినంగా వ్యవహరించలేదని తెలిపారు.తాను సత్రం నడపడం లేదని, ప్రభుత్వాన్ని నడుపుతున్నానని వ్యాఖ్యానించారు. సినిమా వాళ్లు,రాజకీయ నాయకులు ఎవరైనా తనకు మినహాయింపులు లేవని స్పష్టం చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా రహదారులు

# శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక డ్రైవ్

### రూ.54 లక్షల తలసరి ఆదాయం తీసుకురావటం ప్రభుత్వ లక్ష్యం

### సీఎం చంద్రబాబు నాయుడు

**శ్రీకాకుళం:**నరసన్నపేటలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం పరిశుభ్రంగా ఉండాలనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. ఇది నా మనసుకు చాలా దగ్గరగా ఉండే కార్యక్రమం ఇది. ఇవాల్టి నుంచి స్వచ్ఛపథం కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా రహదారులు శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు.అలాగే ప్రతీ నెలా మొదటి తేదీన అర్హులు, అవసరమైన వ్యక్తులకు పెన్షన్లు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా అత్యంత శ్రద్ధగా చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమం లబ్దిదారులకు సరిగ్గా అందుతుందా లేదా అనేది చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నాం. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా దేశానికి జనాబాను సంపదగా మార్చే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే మూడు-నాలుగో సంతానానికి ప్రోత్సాహకం ఇచ్చేలా నిర్ణయం కూడా తీసుకుంటున్నామని అన్నారు.ఇక రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల రికార్డులను ప్రక్షాళన చేసే కార్యక్రమం కూడా చేపడుతున్నాం. వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రజా ప్రభుత్వానిది. అధికారంలోకి వచ్చాక 17వ సారి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నాను. కేవలం మన పరిసరాలు, ఇల్లు, కార్యాలయాలే కాదు అన్ని ప్రాంతాలూ పరిశుభ్రంగా ఉండేలా మన అలవాట్లూ మారాలి. సమాజంలో మార్పు వస్తేనే స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాధ్యం అవుతుంది. 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించుకున్నాం. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీని తీర్చిదిద్దటంతో పాటు రూ.54 లక్షల తలసరి ఆదాయం తీసుకురావటం మా ప్రభుత్వ లక్ష్యం. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి అందరి జీవన ప్రమాణాలు పెంచటమే ఆలోచనగా పనిచేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధికి కూడా నిధులు కావాలి. సంపద సృష్టిస్తేనే సంక్షేమం చేయగలం. పేదవాళ్లకు చేయూతను ఇచ్చేలా పీ4 కార్యక్రమం చేపట్టామని అన్నారు.మార్గదర్శి బంగారు కుటుంబాలుగా వ్యవహరించి పేదరికాన్ని రూపుమాపేలా ప్రయత్నం చేస్తున్నాం. సమాజంలో సంపద కలిగిన 10 శాతం మంది దిగువన ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా భారత్ మారుతుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ లక్ష్యం సాధిస్తాం. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. 2019-24 మధ్య అరాచకం సృష్టించారు. నరకాసురుడు అనే రాక్షసుడిని చంపిన రోజును దీపావళిగా మనం జరుపుకుంటున్నాం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు అది. గత పాలకులు చేసిన చెడును మర్చిపోలేం. 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను గత పాలకులు వదిలేసి వెళ్లారు. దానిని తొలగించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాం. చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేలా ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ ప్రాంతంలో వస్తున్న చెత్త కాంపోస్టుగా, సర్క్యులర్



ఎకానమీ లేదా విద్యుత్ తయారీ ప్లాంట్లకు తరలించేలా ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా చెత్తను వేరు చేయడానికి సెగ్రిగేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేసాం తద్వారా డంపింగ్ యార్డులకు స్వస్తి పలుకుతున్నాం. నెట్ జీరో క్యాంపస్లుగా రాష్ట్రంలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లను తయారు చేస్తున్నాం. వ్యర్థాలు లేకుండా వాటిని స్వచ్ఛమైన క్యాంపస్ లు గా రూపొందిస్తున్నాం. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం పైనా సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించాం. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులలోనూ పరిశుభ్రతను, ఆత్మవిశ్వాసాన్ని నేర్పేలా అమలు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా ఘన వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రాంతాలను 33 శాతం పచ్చదనం వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించామని అన్నారు.

# గన్ వదిలి పెన్ పట్టి...

**కరీంనగర్, మే 16:**మాజీ మావోయిస్టు దేవ్‌జీ దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్మీడియట్ పరీక్ష రాశారు. 1983లో పోలీసుల జోక్యానికి నిరసనగా ఇంటర్ పరీక్షలకు దూరమైన ఆయన.. ఇప్పుడు సామాన్య పౌర జీవితంలో భాగంగా చదువును పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని పరీక్షా కేంద్రంలో తెలుగు పేపర్ రాసిన దేవ్‌జీ.. భవిష్యత్తులో న్యాయవాదిగా మారి పేదల తరపున పోరాడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాలం మారింది.. మార్గమూ మారింది.. కానీ లక్ష్యం మాత్రం సమాజ హితమే అని చాటిచెబుతున్నారు మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి. ఒకప్పుడు గన్ చేతబట్టి అడవి బాట పట్టిన ఈ మాజీ మావోయిస్టు ఇప్పుడు తన అసంపూర్ణ విద్యను పూర్తి చేసేందుకు పెన్ను పట్టారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం ఎక్కడైతే తన చదువు ఆగిపోయిందో.. మళ్లీ అక్కడి నుంచే తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ.. 1982-83 ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విప్లవ భావజాలానికి ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పనిచేశారు. ఆ క్రమంలో ఆయనపై పలు కేసులు నమోదు కావడంతో చదువుకు ఆటంకం ఏర్పడింది. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసినప్పటికీ.. తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినా.. విప్లవ పోరాటంలో భాగంగా అజ్ఞాతంలోకి వెళ్లడంతో మళ్లీ పరీక్ష రాసే అవకాశం చిక్కలేదు.సుదీర్ఘకాలం ఉద్యమంలో కొనసాగి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ.. తన విద్యను పూర్తి చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్‌తో చేరుకున్నారు. తన కన్నా వయసులో చాలా చిన్నవారైన విద్యార్థులతో కలిసి ఏమాత్రం సంకోచించకుండా తెలుగు పరీక్ష రాశారు.పరీక్ష అనంతరం దేవ్‌జీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉద్యమంలోకి వెళ్లినప్పుడు తన చదువు ఎక్కడ ఆగిందో.. అక్కడి నుంచే మళ్లీ మొదలు పెట్టాలని అనుకున్నానని చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత లాసెట్ రాసి న్యాయ విద్యను అభ్యసించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. న్యాయవాదిగా మారి సమాజంలోని పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందించడమే తన తుది లక్ష్యమని అన్నారు. ఒకప్పటి విప్లవ నేత ఇలా విద్యామార్గంలో ప్రజాసేవకు సిద్ధమవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.కాగా, గత ఏడాది కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు చాలా మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. దేవ్ జీ తో పాటు మల్లా రాజిరెడ్డి, ఆశన్న వంటి కీలక నేతలు పలు విడతల్లో పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఆ తర్వాత జన జీవన స్రవంతిలో కలిసిపోయి సాధారణ పౌర జీవితం గడుపుతున్నారు. అందులో భాగంగానే తాజాగా.. దేవ్ జీ ఆగిపోయిన తన చదువును కొనసాగించేందుకు ఇంటర్ పరీక్షలు రాశారు.

## పెట్రోల్ భారం...

- మొదటి పేజీ తరువాయి

లేదని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పట్లో భరోసా ఇచ్చింది. ప్రభుత్వం ఆ ప్రకటనలు చేసిన కొద్ది రోజులకే ఇప్పుడు ధరలు పెరిగాయి. ఈ తాజా పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపి, పలు రంగాలపై ప్రభావం చూపుతుందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రభావం కేవలం వాహనాలకే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, రేషన్, ఆన్‌లైన్ డెలివరీ, బస్సు, ఆటో ఛార్జీలు, రోజువారీ అవసరమైన అనేక వస్తువుల ధరలు పెరుగుతాయి. ఖర్చులు పెరగడంతో రాబోయే రోజుల్లో ఇంటి బడ్జెట్ మరింత పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడతాడు. కొన్ని రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలకు లిమిట్ విధించి విక్రయాలు జరుపుగుతున్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో మొదట రోజువారీ ఉపయోగించే వస్తువులపై ప్రభావం కనిపిస్తుంది. పండ్లు, కూరగాయలను పొలాల నుండి మార్కెట్లకు చేరవేయడానికి రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల వాటి ధరలు పెరుగుతాయి. పాలు, ఇతర డైరీ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్-డీజిల్ ధరలు వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయవచ్చు. ఇంధన ధరలు పెరగడం వల్ల ట్రావెలింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో పాటు సరుకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో అది పలు రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు కంపెనీలు ఛార్జీలను పెంచుతాయి. దీంతో పాటు స్కూల్ బస్సు, ఆటోలు సైతం రేట్లు పెంచుతాయి. పిల్లల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులు తల్లిదండ్రులకు మరింత బారం కానున్నాయి. తాజా నిర్ణయం కారణంగా ఉబర్, ఓలా, ర్యాపిడో బుకింగ్ ధరలు అమాంతం పెంచే అవకాశం ఉంది.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆన్‌లైన్ సేవలపై కూడా పడవచ్చు. అమెజాన్ , ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీలు డెలివరీ ఛార్జీలను పెంచుతాయి. లగేజీ, పార్సిల్స్ పంపే కొరియర్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉంది.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి బలమైన వేదిక

- మొదటి పేజీ తరువాయి

స్త్రీనిధి ద్వారా 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి పేర్కొన్నారు. స్త్రీనిధి అసలు సిసలు మాహిళా బ్యాంక్ అని కొనియాడారు. తెలంగాణ మహిళలకు స్త్రీనిధి ఒక నమ్మకమైన బ్యాంక్గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీనిధి మోడల్ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయని చెప్పారు."కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం. ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అనే నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది" అని మంత్రి తెలిపారు.దేశ జీడీపీలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుతం 18 శాతానికే పరిమితమైందని, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 40 శాతానికి చేరుకుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ మహిళలు కూడా ఆ స్థాయికి ఎదగాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు.చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ముఖ్యంగా గ్రామీణ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి జీవనోపాధిని మెరుగుపరుస్తున్నామని తెలిపారు.స్త్రీనిధి సంస్థపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం పనిచేస్తున్న సంస్థ ప్రతిష్టను దెబ్బతీయడానికి కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అలాంటి ఆరోపణలపై వాస్తవాలను ఉద్యోగులు స్పష్టం చేయాలన్నారు.గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ఇప్పుడు అదే వ్యక్తులు తప్పుడు ఆరోపణలతో సంస్థను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు."మాది ఉద్యోగ అనుకూల ప్రభుత్వం. స్త్రీనిధిలో ఒక్కరిని కూడా తొలగించలేదు. ఇప్పటికే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేశాం. సెర్ప్లో వంద శాతం బదిలీలు నిర్వహించాం. స్త్రీనిధిని బలోపేతం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం తప్ప, ఎవరి ఉద్యోగాలను తొలగించడం కాదు" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.స్త్రీనిధి సంస్థ ఏర్పాటులో, దాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీ విరమణ చేయనున్న విద్యాసాగర్ రెడ్డిని మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

## కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్...

- మొదటి పేజీ తరువాయి

అడుగులు పడుతున్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది. తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లు వాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకు ఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్‌గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది.ఈ ప్రక్షాళనలో కేవలం పనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేసే క్రమంలో సామాజిక సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. ఏఐసిసి ఇచ్చే లీకులు, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే తుది జాబితా ఉంటుందని స్పష్టమవుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం వారిలో నిద్రలేకుండా చేస్తోంది.మొత్తానికి తెలంగాణ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పు మాత్రమే కాదు, ఇది రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే ఒక వ్యూహాత్మక చర్య. ఒకవైపు పదవులు ఊడతాయనే వణుకు, మరోవైపు కొత్త శాఖలు దక్కుతాయనే ఆశల మధ్య తెలంగాణ రాజకీయం ఇప్పుడు వెయిట్ అండ్ వాచ్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. హైకమాండ్ తీసుకునే నిర్ణయం ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాన్ని ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

## గులాబీ మిషన్ 2028..

- మొదటి పేజీ తరువాయి

జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.పదేళ్ల అధికార కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్‌ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు.మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

## తెలంగాణలో 25 ఏళ్ల తర్వాత 'ఎస్ఐఆర్'..

- మొదటి పేజీ తరువాయి

వివరించారు. ఆన్‌లైన్‌లో ఓటర్ల నమోదు కోసం **voters.eci.gov.in** వెబ్‌సైట్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ ఎన్యుమరేషన్ ఫామ్‌ల ఆధారంగా జులై 31న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. దీన్ని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. అలాగే వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ఈ డ్రాఫ్ట్‌పై జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్లు తమ అభ్యంతరాలను తెలియజేయొచ్చని సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చిన ఫిర్యాదులన్నింటినీ పరిశీలించిన తర్వాత అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురిస్తామని వెల్లడించారు. తెలంగాణలో దాదాపు 25 ఏళ్ల క్రితం ఈ 'ఎస్ఐఆర్' ప్రక్రియ జరిగిందని గుర్తుచేశారు.

## కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను అలసిపోనివ్వదు: ప్రధాని మోదీ..

- మొదటి పేజీ తరువాయి

నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ మీతోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు మీతో ఉన్నాయి.కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యాయనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి.

వార్తాతరంగాలు
ఆదివారం 17 మే 2026

# కరీంనగర్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ పార్టీ నేతలతో మంత్రి పొన్నం భేటి...



**హైదరాబాద్:** మినిస్టర్ క్వార్టర్స్ లో కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం నాడు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జి లు, అబ్జర్వర్ల తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,కరీంనగర్ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ , కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్ ,కెకె మహేందర్ రెడ్డి ,ఒడితల ప్రణవ్ నియోజకవర్గ కోఆర్డినేటర్స్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, దుధం వెంకట రమణ , బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆదేం రాజ్ దేఖపతి,సౌజన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత అభివృద్ధి పై చేయాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కార్యక్రమాలు ప్రజల్లోకి వృస్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలు, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో డిసిసి అధ్యక్షులు మండలాల వారిగా పార్టీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చ జరిగింది. ఓటరు జాబితా సవరణ పై నియోజకవర్గ ఇంచార్జి లు ,కోఆర్డినేటర్ లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాల వారిగా వరి ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు లేకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేయాలి. పార్టీలో ముందు నుండి క్రియాశీలంగా ఉన్న వారికి గుర్తింపు ఇవ్వాలి. నామినేటెడ్ పార్టీ పదవుల్లో పార్టీ నిర్ణయించిన విధంగా మూడు సంవత్సరాలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు.

# కరీంనగర్ అభివృద్ధికి 895 కోట్లు

**కేంద్రం పచ్చజెండా**



**కరీంనగర్:** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 895 కోట్లతో ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులకు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ చొరవతో రహదారులు వరద నివారణ, వ్యర్థాల నిర్వహణ పనులకు ఈ నిధులు అందనున్నాయి. ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర అధికారుల బృందం నగరానికి రానుంది మంత్రి సంజయ్ కృషితో కరీంనగర్ మోడల్ సిటీగా మారనుందని అధికారులు తెలిపారు.

# ప్రాణాల మీదకు తెచ్చిన ప్రభుత్వాస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం



**సిద్దిపేట, మే 16:** సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది. గత నెల(ఏప్రిల్) 14న రామాయంపేటకు చెందిన నందిని డెలివరీ కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చింది. ఆపరేషన్ చేసిన తర్వాత బ్లీడింగ్ ఎక్కువ అవుతోందని డాక్టర్ సింధూరి కాటన్ పెట్టారు. అయితే కాటన్ తొలగించేందుకు మళ్లీ రావాల్సి ఉంటుందని పేషెంట్‌కు చెప్పడం మర్చిపోయారు డాక్టర్. దీంతో నెల రోజులుగా నందిని శరీరంలో కాటన్ అలాగే ఉండిపోవడంతో ఇన్ఫెక్షన్‌తో ఆమె అనారోగ్యానికి గురైంది. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణిస్తుండటంతో నందిని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లింది. దీంతో ప్రభుత్వ డాక్టర్ చేసిన నిర్వాకం బయటపడింది. ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల ఇన్ఫెక్షన్ వచ్చిందని ప్రైవేటు ఆస్పత్రి డాక్టర్ తేల్చి చెప్పారు. దీంతో నందిని కుటుంబసభ్యులు షాక్‌కు గురయ్యారు. వెంటనే సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి వెళ్లిన నందిని కుటుంబసభ్యులు, బంధువులు.. వైద్యుల నిర్లక్ష్యంపై నిలదీస్తూ ఆందోళనకు దిగారు. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల తీరుపై బాధితులు, పేషెంట్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి: ప్రధాని మోదీకి కవిత లేఖ

**ప్రధాని మోదీకి తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత లేఖ**

**కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను తొలగించాలని డిమాండ్**

**కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావడమే ఇందుకు కారణం**


**హోం శాఖ మంత్రిగా ఉంటే దర్యాప్తు ప్రభావితమవుతుందని ఆరోపణ**

**నిష్పక్షపాత విచారణ కోసం బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం. "కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. "అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు. 17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# తెలంగాణలో సర్ చిచ్చు




**హైదరాబాద్, మే 16:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' చిచ్చు రేపుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య యుద్ధానికి దారితీసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వహిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీస్తోంది.ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడమే 'సర్' లక్ష్యమని కేంద్రం చెబుతున్నా, బీజేపీయేతర పార్టీలు మాత్రం దీనిని ఒక రాజకీయ ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. పశ్చిమ బెంగాల్లో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ముఖ్యంగా అక్రమ వలసదారుల పేరుతో మైనార్టీ వర్గాల ఓట్లు గల్లంతు చేశారని, తద్వారా బీజేపీ లబ్ధి పొందిందనే వాదన బలంగా వినిపించింది.బీహార్ లో కూడా ఆర్‌జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు సర్ విధానాన్ని వ్యతిరేకించాయి. పారదర్శకత లేని తొలగింపులు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వీధుల్లోకి వచ్చి పోరాడితే, తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది.టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ను కలిసి ా×=పై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. పౌరసత్వ చట్టాన్ని సాకుగా చూపి మైనార్టీల ఓట్లను తొలగించవద్దని, 14 రకాల గుర్తింపు కార్డుల్లో దేనిని చూపించినా ఓటరుగా గుర్తించాలని కోరింది. నిజామాబాద్, భైంసా, బోధన్ వంటి ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో, అక్కడ 'సర్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.దేశవ్యాప్తంగా బీజేపీయేతర పక్షాలు 'సర్'పై గళమెత్తుతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీని వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మైనార్టీల ఓట్ల కోసం 'సర్'ను వ్యతిరేకిస్తే, మెజారిటీ హిందూ ఓటర్లలో వ్యతిరేకత వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, ఇప్పుడు వారి కోసం పోరాడి ఉన్న హిందూ ఓట్లను పోగొట్టుకోవడం ఎందుకని బీఆర్ఎస్ భావిస్తుండవచ్చు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటనపై కూడా బీఆర్ఎస్ పెద్దగా స్పందించలేదు. 'సర్' వంటి విధానపరమైన అంశాల్లో బీజేపీని విమర్శించకపోవడం ద్వారా, కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ వంటి చోట్ల ఎంఐఎం బలంగా ఉంది. అక్కడ ఓట్లు తొలగించినా ఎంఐఎంకే నష్టం తప్ప తమకేమీ కాదనే ధీమా కూడా బీఆర్ఎస్‌లో ఉండవచ్చు.ఒకవైపు కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతోంది. ఎంఐఎం తనదైన శైలిలో పోరాటానికి సిద్ధమవుతోంది. కానీ, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీ, ఇంతటి కీలకమైన అంశంపై నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యాక, తుది జాబితా వచ్చాక కూడా బీఆర్ఎస్ ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. ఆ పార్టీ కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఓటు హక్కుపై ఆసక్తి లేదని స్పష్టమవుతుంది.బీఆర్ఎస్ మౌనం.. బీజేపీకి పరోక్షంగా సహకరించడమే అవుతుందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'సర్'చుట్టూ జరుగుతున్న ఈ లొల్లి, రాబోయే ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.

# గ్రేటర్ పై ధరల భారం..

**హైదరాబాద్, మే 16:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు. అయితే ఈ సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి.ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్పు వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది.ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది. సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలనుసమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి. అదేమంటే గత నాలుగేళ్ల నుంచి ధరలను పెంచలేదంటూ కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ, పశ్చిమాసియా యుద్ధం ప్రభావం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగడంతో చమురు సంస్థలు నష్టాల్లో పడ్డాయని అందుకే ధరలను పెంచకతప్పదని గత కొన్ని రోజులుగా లీకులిస్తున్నాయి. ప్రధాని మోదీ తో సహా పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలంటూ పొదుపు మంత్రం పఠించారు.తాజాగా లీటరు పెట్రోలుపై మూడు రూపాయలు, లీటరు డీజిల్ పై మూడు రూపాయలు అదనంగా వడ్డించి ప్రజల నడ్డి విరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు లీటరు పెట్రోలుపై రెండు రూపాయలు తగ్గించి ఓట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన తర్వాత మూడు రూపాయలు అదనపు భారం వేసింది. దీని వల్ల



నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగనున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు పై 3.29 రూపాయలు, డీజిల్ పై లీటరకు 3.14 రూపాయలు పెంచాయి. తెలంగాణాలో పెట్రోలు, డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు పెంచాయి.మెట్రో నగరం కావడంతో ఎక్కువ మంది పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఓటెత్తే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# మే చివరి నాటికే నైరుతి రుతుపవనాల ఎంట్రీ



**హైదరాబాద్, మే 16:** తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే.. అంటే మే 26 నాటికే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇది మే 22 నుంచి 30 మధ్య మారవచ్చునని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణను జూన్ 1 లేదా 2వ తేదీల్లో రుతుపవనాలు పలకరించనున్నాయి. అయితే ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షపాతం సాధారణం కంటే కొంచెం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ విభాగం ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందే దేశంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు.. ఈసారి ఐదు రోజులు ముందుగానే అంటే మే 26 నాటికే కేరళను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వాతావరణంలో వస్తున్న మార్పుల ఆధారంగా మే 22 నుంచి మే 30 మధ్య కాలంలో ఎప్పుడైనా ఇవి కేరళ తీరాన్ని తాకవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు సైతం రుతుపవనాల రాక ముందస్తుగానే ఉండబోతోంది. సాధారణంగా కేరళ తీరాన్ని తాకిన ఐదు రోజుల తర్వాత రుతుపవనాలు రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశిస్తాయి. గతేడాది వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. మే 24న కేరళను తాకిన రుతుపవనాలు మే 31 నాటికి తెలంగాణను పలకరించాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 1 లేదా రెండో తేదీ నాటికే తెలంగాణవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ముందస్తు రుతుపవనాల రాకతో తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు, సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది.అయితే, వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఒక కీలక హెచ్చరికను కూడా జారీ చేసింది. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే కొంచెం తక్కువగా వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ అభిప్రాయపడింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ వర్షాకాలంలో సగటున 80 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉండగా.. 1971-2020 మధ్య కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్లుగా ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ముందస్తు రుతుపవనాల రాక సాగు పనులకు సానుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.మరోవైపు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరింది. శుక్రవారం పగటిపూట అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో 44.5 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే, ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# నీట్ పేపర్ లీకేజీ కేసులో సూత్రధారి అరెస్ట్..

**పుణేలో సీబీఐ అదుపులోకి**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పీవీ కులకర్ణిని సీబీఐ అధికారులు పుణేలో అరెస్ట్ చేశారు. రసాయన శాస్త్ర లెక్చరర్‌గా పనిచేస్తున్న కులకర్ణి, జాతీయ పరీక్ష సంస్థ (చీూ) తరఫున ప్రశ్నాపత్రాలు రూపొందించే బృందంలో సభ్యుడిగా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# బండి భగీరథ్‌కు షాక్.. దేశం వీడకుండా లుకౌట్ నోటీసులు

**మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న భగీరథ్**

**పోక్సో చట్టం కింద కేసు నమోదు**

**ఇప్పటికీ పోలీసులకు చిక్కని వైనం**

**బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్న పోలీసులు**



మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ కేసులో పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే నిందితుడు దేశం దాటిపోకుండా ఉండేందుకు పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయించారు. భగీరథ్‌పై ఇప్పటికే పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. ప్రస్తుతం పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు ఐదు ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలిస్తున్నారు ఇందులో భాగంగా బంజారాహిల్స్‌లోని బండి సంజయ్ ఇంట్లో ఒక పోలీసు బృందం సోదాలు నిర్వహిస్తోంది. భగీరథ్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నవారి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. అతని స్నేహితులు, బంధువుల ఇళ్లపై కూడా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. నిందితుడి జాడ కనిపెట్టేందుకు అన్ని కోణాల్లోనూ తనిఖీలు ముమ్మరం చేశారు. మరోవైపు ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్ విషయంలో భగీరథ్‌కు హైకోర్టులో చుక్కెదురైన విషయం తెలిసిందే. శుక్రవారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ దశలో ముందస్తు బెయిల్‌పై ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అయితే అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే అంశంపై నిర్ణయాన్ని వచ్చే వారానికి వాయిదా వేసింది.

# గర్భిణీల ప్రాణాలతో చెలగాటం

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో వరుస నిర్లక్ష్య ఘటనలు**

**షాద్‌నగర్, తాండూరు ఆసుపత్రుల్లో కలకలం**

**కాన్పు అనంతరం మహిళల తీవ్ర అవస్థలు**

**చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబాల డిమాండ్**



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం మరోసారి బయటపడింది వారం వ్యవధిలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్, వికారాబాద్ జిల్లా తాండూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన రెండు ఘటనలు ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి ప్రసవం కోసం ఆసుపత్రులకు వచ్చిన మహిళల ప్రాణాలతో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి షాద్‌నగర్‌లో మూడు నెలల నరకయాతన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో భవ్య అనే 27 ఏళ్ల మహిళ ఈ ఏడాది ఫిబ్రవరి 7న ప్రసవం కోసం చేరింది ఆమెకు సాధారణ ప్రసవం జరగగా మగబిడ్డకు జన్మనిచ్చింది అయితే ప్రసవం అనంతరం రక్తస్రావం ఆపేందుకు వైద్య సిబ్బంది వజైనాలో కాటన్ బట్ట ఉంచి మరిచిపోయినట్లు ఆరోపణలు వెలువడ్డాయి ఇంటికి వెళ్లిన తర్వాత భవ్య తీవ్ర కడుపునొప్పి, రక్తస్రావంతో బాధపడింది. పలుమార్లు ఆసుపత్రికి వెళ్లినా వైద్యులు కేవలం పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ ఇచ్చి పంపించారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మూడు నెలల పాటు తీవ్ర అవస్థలు పడిన అనంతరం మరో మహిళా వైద్యురాలు పరీక్షించగా లోపల ఉన్న కాటన్ బయటపడింది మా కోడలు ప్రాణాలతో పోరాడుతుంటే ఎవరూ పట్టించుకోలేదు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తే అధికారులు స్పందించడం లేదు అంటూ బాధితురాలి అత్త నిర్మలమ్మ ఆవేదన వ్యక్తం చేశారు తాండూరులో మరో ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నావాల్గ గ్రామానికి చెందిన ఆర్తి అనే గర్భిణి ఈ నెల 3న తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది ఆమెకు సాధారణ ప్రసవం జరగగా రక్తస్రావం ఆపేందుకు కాటన్ ఉంచి కుట్లు వేసినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు అనంతరం కాటన్ తొలగించకుండా డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు ఇంటికి వెళ్లిన కొద్ది రోజులకే ఆర్తి తీవ్ర అస్వస్థతకు గురైంది దీంతో కుటుంబ



సభ్యులు తిరిగి ఆసుపత్రికి తీసుకురాగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు బాధితురాలి బంధువులు సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేశారు

**చర్యలు శూన్యం**
**ప్రజల్లో ఆగ్రహం**

రెండు ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడంపై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద మహిళల ప్రాణాలకు భరోసా లేకుండా పోతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు నిరసన

**షాద్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత**




**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ముఖ్య కూడలిలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బికేఎంయు), తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు ఆయిల్ కంపెనీలను ప్రైవేటుపరం చేసి, ధరల నియంత్రణ పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపిందని మండిపడ్డారు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరల పేరుతో సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం సరికాదని, ప్రజలపై ప్రేమ ఉంటే ఆ భారం ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు దేశంలో ధరల నియంత్రణ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారాన్ని నిలబెట్టుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని ఆరోపించారు. ఇప్పటికైనా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని, లేదంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, కొత్తూరు మండల ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల నాయకులు రాములు గౌడ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 18న ప్రజావాణి రద్దు....



**జోగులాంబ గద్వాల, మే 16 (స్కై న్యూస్):** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 18న రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిశా కమిటీ సమావేశము మరియు భారీ వరదలు, విపత్కర సంఘటనలు సంభవించే సమయంలో సంబంధిత శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 18న జిల్లాలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం మొత్తం అక్కడే ఉంటున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. ఈనెల 25న యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేసినారు.

## నూతన బోర్ మోటార్ ను ప్రారంభించిన షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని 15వ వార్డులో వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన బోర్ మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలకు తాగునీరు సహా ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జమ్రుద్ ఖాన్ సాదిక్ మల్లికార్జున్ మున్సిపల్ అధికారులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులా ప్రాణాల పాతాళ గుహలా?

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నిర్లక్ష్యం పేదల ప్రాణాలతో చెలగాటం**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అంటే ప్రాణాలతో జూదమా?**

**తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా తీవ్ర ఆగ్రహం**





**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో తెలంగాణ రక్షణ సేన(టీ ఆర్ ఎస్) ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల ఘోర నిర్లక్ష్యం ఇద్దరు మహిళల ప్రాణాలను బలి తీసుకునే స్థాయికి చేరిందంటూ ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం అంటే ప్రాణాలతో జూదమా అంటూ ఆయన ప్రశ్నించారు షాద్‌నగర్‌లో గర్భసంచిలో ప్యాడ్ తాండూరులో కడుపులో కాటన్ ప్రభుత్వ వైద్యుల ఘోర నిర్లక్ష్యం ఇద్దరు మహిళల ప్రాణాలను బలి తీసుకునే స్థాయికి చేరిందంటూ తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసిన భవ్య గర్భసంచిలో ప్యాడ్ మరిచిపోయిన వైద్య సిబ్బంది మూడు నెలల పాటు ఆమెను నరకయాతనకు గురిచేశారు నొప్పితో విలవిల్లాడుతున్నా మందులు వేసుకో అంటూ పంపించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు చివరకు ప్రైవేట్ డాక్టర్ పరీక్షించగా అసలు దారుణం బయటపడింది అదేవిదంగా తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో ఆర్తి అనే మహిళ కడుపులో కాటన్ పెట్టి కుట్లు వేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితికి చేరినా బాధ్యత వహించాల్సిన వైద్యులు చేతులు దులుపుకోవడం ప్రజల్లో ఆగ్రహం రగిలిస్తోంది ప్రభుత్వ ఆసుపత్రులా లేక పేదల ప్రాణాల శ్మశానాలా అంటూ ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి నిర్లక్ష్య వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి అంటూ ఎండి. ముస్తఫా డిమాండ్ చేశారు పేదల ప్రాణాలకు విలువ లేదా ఇంకెంతమంది బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది అనే ప్రశ్నలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నాయి వ్యక్తం చేశారు షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేసిన భవ్య గర్భసంచిలో ప్యాడ్ మరిచిపోయిన వైద్య సిబ్బంది మూడు నెలల పాటు ఆమెను నరకయాతనకు గురిచేశారు నొప్పితో విలవిల్లాడుతున్నా మందులు వేసుకో అంటూ పంపించారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు చివరకు ప్రైవేట్ డాక్టర్ పరీక్షించగా అసలు దారుణం బయటపడింది అదేవిదంగా తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో ఆర్తి అనే మహిళ కడుపులో కాటన్ పెట్టి కుట్లు వేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితికి చేరినా బాధ్యత వహించాల్సిన వైద్యులు చేతులు దులుపుకోవడం ప్రజల్లో ఆగ్రహం రగిలిస్తోంది ప్రభుత్వ ఆసుపత్రులా లేక పేదల ప్రాణాల శ్మశానాలా అంటూ ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి నిర్లక్ష్య వైద్యులను వెంటనే సస్పెండ్ చేయాలి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి అంటూ ఎండి. ముస్తఫా డిమాండ్ చేశారు పేదల ప్రాణాలకు విలువ లేదా ఇంకెంతమంది బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది అనే ప్రశ్నలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా వినిపిస్తున్నాయి.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**మల్దకల్, మే 16(స్కై న్యూస్):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా శనివారం , మల్దకల్ మండలంలోని బిజ్వరం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలోశాస్త్రవేత్త డా. యం. శంకర్ మాట్లాడుతూ తక్కువ యూరియా వాడాలని,దాని వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా నేల సారాన్ని కాపాడుకోవచ్చని, అవసరం మేరకే రసాయనాలను వాడాలని, సేంద్రీయ పద్ధతులలో వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అదే విధంగా శాస్త్రవేత్త ఏ. శ్రీరామ్ మాట్లాడుతూ పంటమార్పిడి మరియు దాని అవసరం, మార్కెట్ లో గిరాకీ ఉన్న వరి రకాలను పండించడం వలన అధిక దిగుబడితో పాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్ ను కూడా పొందవచ్చని, సరియైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించడం వలన, నీటిని ఆదా చేసి భావి తరాలకు ఇవ్వడం మన బాధ్యత అని తెలియజేయడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి కే. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రధాన పంట సమస్యలను వాటి యాజమాన్య పద్ధతులను గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ , ఏఈఓ సోనియా మరియు బిజ్వరం రైతు సోదరులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## కవి శ్రీ రఘు శ్రీ కి ఘన సత్కారం



**హైద్రాబాద్, మే 16 :** ప్రముఖ అంతర్జాతీయ సంస్థ సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం తన 32 వ వార్షిక వేడుకలు వంశీ ఇంటర్నేషనల్ సంస్థ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి పాల్గున్న వంశీ ఇంటర్నేషనల్ సంస్థ అధినేత శిరోమణి డాక్టర్ వంశీ రామరాజు మాట్లాడుతూ.... ఐదు దశాబ్దాలకు పైగా మానస సాహితీ సంస్థ అధినేత గా, జంటనగరాల అనేక కవి సమ్మేళనం కార్యక్రమాలకు సంధాన కర్తగా, తెలుగు సాహితీ రంగం ఉన్నతి కి కవి రఘు శ్రీ దోహదపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా కవి రఘుశ్రీ ని వంశీ రామరాజు ఘనంగా సత్కరించి, ఇట్కాలా సాహితీ పురస్కారం ప్రదానం చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఇట్కాలా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, అంతర్జాతీయ సేవా మూర్తి, సంస్కృతిరత్న డాక్టర్ కే. ధర్మారావు మాట్లాడుతూ కవి రఘు శ్రీ తెలుగు సాహిత్యానికి దశాబ్దాలుగా చేస్తున్న సేవలకు తాను ప్రత్యక్ష సాక్షినని, ఆయన మరెన్నో కార్యక్రమాల ద్వారా భావి తర సాహితీ స్రష్ట లకు స్ఫూర్తి వంతం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే పెన్షనర్ల జాతీయ కార్మిక నేత, సేవారత్న పీ. యుగంధర్, ఎసత్యసాయి మెడికల్ క్యాం పుల సంధాన కర్త కే. వీ. భాను మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఇట్కాలా సాహితీ పురస్కార గ్రహీత కవి రఘుశ్రీ మాట్లాడుతూ తాను నిస్వార్థంగా తెలుగు సాహిత్య రంగానికి సేవలను కొన్ని దశాబ్దాలుగా చేస్తున్నానని అన్నారు. ఈ అవార్డు అందుకోవడం తనకు ఎనలేని ఆనందాన్ని కలిగించిందని కవి రఘుశ్రీ చెప్పారు.

## గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు పిల్లిగుండ్ల కాలనీలో బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలి



**జోగులాంబ గద్వాల, మే 16(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని గద్వాల మున్సిపాలిటీ 7వ వార్డు పరిధిలో ఉన్న పిల్లిగుండ్ల కాలనీ ప్రజలు తమ ప్రాంతంలో వెంటనే బస్తీ దవఖాన ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోరుతున్నారు. కాలనీలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాథమిక వైద్య సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకే పట్టణంలోని దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, మహిళలు, చిన్నారులు అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు మరింత కష్టాలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. పిల్లిగుండ్ల కాలనీలో శాశ్వత బస్తీ దవఖాన ఏర్పాటు చేస్తే వేలాది మంది పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కాలనీ వాసులు అభిప్రాయపడుతున్నారు. సాధారణ వైద్య పరీక్షలు, రక్తపోటు, మధుమేహ పరీక్షలు, గర్భిణీల ఆరోగ్య సేవలు, చిన్నారుల టీకాలు వంటి సేవలు స్థానికంగానే అందే అవకాశం ఉంటుందని తెలిపారు. కాబట్టి ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి, వార్డ్ కౌన్సిలర్ జగదీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి పిల్లిగుండ్ల కాలనీలో బస్తీ దవఖాన మంజూరు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే ఈ సమస్యను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు గొల్ల మధు ,ఎం. రమేష్, తెలుగు సాయి బాబా, పెదరాయుడు, అశోక్ గోపాల్, సద్దల గోపాల్, ఎం. ప్రభాకర్, వార్డు ప్రజలు, తదితరులు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**యువ సత్తా లక్ష్మణ్ కుమార్, సామాజికవేత్త నవీన్ కుమార్ విజ్ఞప్తి**



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో వచ్చే రోగుల పట్ల వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని యువ సత్తా లక్ష్మణ్ కుమార్, సామాజికవేత్త నవీన్ కుమార్ ప్రభుత్వ ఆసుపత్రి అధికారులను కోరారు ఇటీవల షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అనంతరం మహిళ గర్భంలో కాటన్ ప్యాడ్ మరిచిపోయిన ఘటనపై ఆసుపత్రి ముఖ్య కార్యనిర్వాహణాధికారిని కలిసి వివరాలు తెలుసుకున్నట్లు వారు మీడియాకు తెలిపారు ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా బాధ్యతతో వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌ను కోరినట్లు చెప్పారు ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా వైద్య సిబ్బంది సేవలు అందించాలన్నారు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

# అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలి

**మున్సిపల్ ఛైర్మన్ కు సిపిఎం పార్టీ వినతి**



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )**పేద ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా స్వంత ఇంటి కోసం ఎదురుచూస్తున్నారు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిజమైన అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా రాజకీయ పక్షపాతం లేకుండా వెంటనే కేటాయించాలని ఈరోజు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా నాయకులు ఎన్. రాజు పట్టణ కార్యదర్శి శ్రీను నాయక్ మాట్లాడుతూ షాద నగర్ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్నారు నిరుపేద ప్రజలకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వెంటనే కేటాయించాలని వారు విజ్ఞప్తిచేశారు అదేవిధంగా పట్టణంలో అనేకమంది పేద ప్రజల సంత ఇల్లు లేక అద్దె ఇంట్లో ఇబ్బందికర పరిస్తితులు జీవనం కొనసాగిస్తున్నారు ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిజమైన వారిని గుర్తించి పాదదర్శంగా కేటాయించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నారని వారు ఉన్నారు రెండో విడత అర్హుల జాబితాను వెంటనే ప్రకటించాలి ఇండ్ల కేటాయింపులో అవినీతి, ఆలస్యం నివారించాలి నిరాశ్రయ పేదలకు ప్రాధాన్యత ఇవ్వాలి ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి ఇల్లు ప్రతి పేద కుటుంబానికి హక్కు దానిని వెంటనే అమలు చేయాలి ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు లక్ష్మి కావలి రాజు, మహమ్మద్ బాబు, పారిజాత, మిన్హాజ్ బేగం, లలిత, శ్రీలత, అంజమ్మ అంగోత్ లక్ష్మి, శ్రీకాంత్ ముఖిత్, సంతోష తదితరులు పాల్గొన్నారు

# భక్తులతో చెక్కిరిసిన శ్రీ కురుమూర్తి కొండలు





**చిన్న చింతకుంట మే 16 (స్కై న్యూస్);** దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గుహలో స్వయంభుగా వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిరూపమైన శ్రీ కురుమూర్తి స్వామి తెలంగాణ పేద ప్రజల విలవేల్పు దైవం దర్శనానికి అమావాస్యని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు తండోపతండులుగా కదిలివచ్చి సామి పుష్కరిణిలో పవిత్ర స్నానాలు చేసి తడి గుడ్డలతో క్యూలైన్లో నిలిచి వివిధ నామాలతో గోవింద నామస్వరన్న చేస్తూ వివిధ ఆలయాల దర్శించుకున్న అనంతరం స్వామికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండ దిగువ భాగంలో స్వామికి ధూప దీప నైవేద్యములు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం చేశారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలకుండా ఆలయ సిబ్బంది, ఆలయ పాలకవర్గం చైర్మన్ బత్తుల బాలరాజ్ ఆలయ పాలకమండలి సభ్యులు ఎప్పటికీ అప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తూ ఎవ్వరికీ ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను చేస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ఏర్పాటు పట్ల హర్షం

**ప్రజా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఉద్యమకారుల సంక్షేమ సమితి నాయకులు**



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడాన్ని ఉద్యమకారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు పి. వెంకట్ రాంరెడ్డి స్వాగతించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల పట్ల గౌరవం చూపుతూ కమిటీ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ముఖ్యంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్యమకారులను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు ఇప్పటికైనా ఉద్యమకారులను త్వరితగతిన గుర్తించి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి జి. సుధాకర్, సిరాజుద్దీన్, రవికుమార్ గౌడ్, మేకల వెంకటేష్, ఉమప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులనిర్లక్ష్యం...వృథాగా భగీరథ పైపులు

**ప్రజలకు ఇబ్బందులు**



**నారాయణపేట మే 16: (స్కైన్యూస్)** ప్రజలకు మంచినీరు తాపా లన్న సదుద్దేశంతో ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద గ్రామ గ్రామంలో పైపు లైన్ నిర్మాణం కోసం పైపులు సర ఫరా చేసింది.అయితే అధికా రుల నిర్లక్ష్యం వల్ల పైపులు నారాయణపేట జిల్లా లోని పలు గ్రామాల్లో వృథాగా పడివున్నాయి.వాటితో ప్రజలు పలు ఇబ్బందు లు,ప్రమాదాలకు గురి అవుతున్నారు.నారాయణపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనుల కోసం తీసుకొచ్చిన పైపులు సంవ త్సరాలుగా ఇళ్ల మధ్యలో, రోడ్ల పక్కన, పంట పొలాల్లో అలాగే వదిలివేయడంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు.ఇళ్ల మధ్యలో పైపులు ఉండటం వల్ల రాకపోకలకు ఆటంకం కలుగుతుండగా, చిన్నపిల్లలకు ప్రమాదకరంగా మారినట్లు స్థానికులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. అలాగే పంట పొలాల్లో పైపులు ఉండటంతో రైతులు వ్యవసా య పనులు నిర్వహించ డంలో ఇబ్బందులు పడుతు న్నారు.అభివృద్ధి పనుల పేరుతో తీసుకొచ్చిన సామ గ్రిని ఇలా నిర్లక్ష్యంగా వదిలే యడంబాధ్యతారాహిత్యమని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో పేరుకుపోయిన మిషన్ భగీ రథ పైపులను తొలగించి ప్రజ లకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవా లని స్థానికులు కోరుతున్నా రు.

# దేశ ప్రజలపై అధిక పన్నుల భారం మోపడమే కేంద్ర ప్రభుత్వ విధానమా?

**రామరాజ్యం అంటు దోపిడి పాలన చేస్తున్నారు**

**పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు**

**ర్యాలీ,పాత బస్టాండ్ లోధర్నా**




**జోగులాంబ గద్వాల, మే 16 (స్కై న్యూస్):**గద్వాల జిల్లా కేంద్రం: పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి పేద ప్రజలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పెను భారం మోపిందని, కేంద్ర సర్కార్ వైఫల్యంతోనే దేశంలో అధిక ధరల పెరుగుదల అని రామరాజ్యంలో నేడు దోపిడి పాలన సాగుతున్నదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు విమర్శించారు. శనివారం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల తగ్గించాలని డిమాండ్ చేస్తూ గద్వాల జిల్లా కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయం కొత్త బస్టాండ్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ గా వెళ్ళి వై ఎస్ ఆర్ సర్కిల్ లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం రోజురోజుకు ధరలను పెంచి పేద ప్రజలపై అధిక భారం మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం వలన నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో పాటు రవాణా చార్జీలు కూడా పెరుగుతాయని, దీంతో పేద ప్రజలు ఇబ్బందుల పాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం వాణిజ్య సిలెండర్ల ధరలను రూ. 993 పెంచడంతో రూ.3100కు చేరుకున్నదని, గృహ అవసరాల గ్యాస్ సిలెండర్ పై రూ.50 పెంచడం, అలాగే పెట్రోల్, డీజిల్ మీద లీటరు రూ. 3, పెంచడం జరిగిందని, దీంతో ప్రజల మీద మూలిగే నక్కపై తాటి పండు పడ్డ చందంగా ఉందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలెండర్ ధరల వలన నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ద్రవ్యోల్బణం పెరిగి ప్రజలపై ఆర్థిక భారాలు పడతాయని అన్నారు. అమెరికా– ఇరాన్ యుద్ధం వలన భారతదేశానికి ఎలాంటి ప్రమాదం లేదని, చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నాయని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచుతున్నట్లని దుయ్యబట్టారు. వాహనదారులను, పేద ప్రజలను కేంద్ర ప్రభుత్వం నిలువు దోపిడీ చేస్తుందని విమర్శించారు. పేద ప్రజలపై అధిక భారం మోపి దోచుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఖాసిం నాయకత్వం వహించారు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్కూర్ రంగన్న, ఆశన్న,జిల్లా సమితి సభ్యులు రవి తదితరులు మాట్లాడారు,మండల సహాయ కార్యదర్శి నారాయణ, వెంకటేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భరత్,ప్రవీణ్. ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి శాంతన్న, సిపిఐ ఏఐటియుసి నాయకులు ప్రభుదాస్, మస్తాన్, రాజు, ధర్మాన్న,వెంకటరాములు, చెనిగొని పల్లి సిపిఐ కార్యదర్శి వెంకటేశ్, తిమ్మప్ప , గోకారి,శేఖర్, తదితరులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గద్వాల్‌లో ఘనంగా ప్రారంభమైన 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలు



జోగులాంబ గద్వాల్ జిల్లా గద్వాల్ పట్టణంలోని బృందావన్ గార్డెన్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గద్వాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి నర్సింహులు, వైస్ చైర్మన్ శంకర్, గద్వాల్ వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ హనుమంతు, పట్టణ కౌన్సిలర్లు, సంస్కార్ స్కూల్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.నాట్య తరంగిణి డాన్స్ అకాడమీ నృత్య విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. అనంతరం ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధికారికంగా 16వ జాతీయ ఓపెన్ తైక్వాండో పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్వాల్‌లో జాతీయ స్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించడం ఎంతో గర్వకారణమని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, తల్లిదండ్రులకు హృదయపూర్వక స్వాగతం మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి పోటీల పాత్ర ఎంతో ముఖ్యమని, గద్వాల్‌కు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువస్తాయని పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొంటున్న ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభను చాటి రాష్ట్రం, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు ముట్ట శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ మాస్టర్ కె. శ్రీహరి మరియు అసోసియేషన్ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ జాతీయ పోటీలకు దాదాపు 20 రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు విచ్చేయగా, రెండు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నాయి.

# పేట లో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ ర్యాలీ

**నారాయణపేట మే 16: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవా న్ని పురస్కరించుకొని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో అవ గాహన ర్యాలీ నిర్వహించా రు.స్థానిక ఆర్డిఓ కార్యాల యం ప్రాంగణం నుండి అవగాహన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు.ఈ అవగాహన ర్యాలీ పుర వీధుల గుండా సాగింది. సావర్కర్ చౌరస్తాకు చేరుకొని అక్కడ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మీకాంత్ మాట్లాడు తూ డెంగ్యూ వ్యాధి ఎడిస్ ఆడ దోమ వల్ల వ్యాపిస్తుం దని అన్నారు.ఈ వ్యాధి యొక్క ముఖ్య లక్షణం చలితో కూడిన జ్వరం ,ఒళ్ళు నొప్పులు, వాంతులు, విరేచనాలు శరీరంపై దద్దుర్లు ఉంటాయని తెలియజేశారు. యూపీఎస్సీ వైద్యాధికారి డాక్టర్ జాగ్రాజ్ మాట్లాడు తూ డెంగ్యూ వ్యాధికి నిర్ధా రణ పరీక్షలకై డెంగ్యూ ఆర్ డి టి కిట్స్ ,ఈ ఎల్ ఐ ఎస్ పద్ధతులు ఉన్నాయని డాక్టర్ ద్వారా చికిత్స పొంది పూర్తి గా నయం చేసుకోవచ్చని తెలిపారు. నారాయణపేట జిల్లా లో గత సంవత్సర ములో 71 కేసులు మాత్రమే నమోదు అయ్యాయని ఈ సంవత్సరము ఇప్పటి వరకు 1 కేసు నమోదు అయిందని తెలిపారు.అదేవిధంగా కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాట్లాడుతు ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమల ఉత్పత్తిని తొలగించాలని, ప్రతి శు క్రవారం డ్రైడే పాటించాలని, ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు.కో ఆర్డినేటర్ అశోక్ కుమార్ జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పై ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సిబ్బంది తబితా రాణి, శంకర్,హెల్త్ అసిస్టెంట్స్ గోవిందరావు, బాల శేఖర్.



ఏఎన్ఎం లు శివ శేషమ్మ, కరుణమ్మ, పుష్ప ,రామేశ్వరి, సరస్వతి,పుష్పలత,యు పి హెచ్ సి ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అభివృద్ధి పథం లో దూసుకెళ్తున్న జడ్చర్ల నియోజకవర్గం

**పెద్దాయపల్లి వద్ద శరవేగంగా జరుగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు**

**ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన జడ్చర్ల నియోజకవర్గం ప్రజలు**






**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యా అందిస్తామని చెప్పి నామమాత్రంగా గురుకులాలను కనీస మౌలిక వసతులు కల్పించకుండా ప్రైవేట్ బిల్డింగ్ లో ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం జరిగిందని ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక జడ్చర్ల నియోజకవర్గం పెద్దాయపల్లి సమీపంలో 200 కోట్ల రూపాయలతోటి గౌరవ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కి శంకుస్థాపన చేయడం జరిగింది 50 కోట్ల రూపాయలతోటి మహబూబ్ నగర్ ఎంపీ సహకారంతో నవోదయ విద్యాలయం కూడా నిర్మాణం జరగబోతుంది అదేవిధంగా 400 కోట్లతో త్రిబుల్ ఐటీ నిర్మాణం జరుగుతుంది జననేత జనం పల్లి ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల నియోజకవర్గం విద్య హబ్బుగా మారింది అనడంలో ఎలా సందేహం లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు కొనియాడుతున్నారు అహర్నిశలు జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న జననేత జనంపల్లి అనిరుద్ రెడ్డి లాంటి నాయకుడే జడ్చర్ల నియోజకవర్గానికి ఎల్లప్పుడూ ఎమ్మెల్యేగా ఉండాలని జడ్చెర్ల నియోజకవర్గ ప్రజలు కోరుకోవడం విశేషం.

# ఉద్యోగ వయోపరిమితిని 46 ను కొనసాగించాలి



**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగ దరఖాస్తుల వయోపరిమితిని 46 సంవత్సరాలకు పెంచడం జరిగిందని దాన్ని యధావిధిగా కొనసాగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగపూర్ మధు డిమాండ్ చేశారు శనివారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్ కు అందించాడు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జనరల్ కేటగిరీలో ఉన్న 34 సంవత్సరాల వయోపరిమితిని గత ప్రభుత్వం 46 ఏళ్లకు సడలించడం జరిగిందని గడువు ఫిబ్రవరి 8న ముగిసిన ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల నిరుద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వివరించారు. ఉద్యోగాల భర్తీకై ప్రభుత్వం ఒక వైపు నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో వయస్సు భారంతో నిరుద్యోగులు సతమతమవుతున్నారని వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సుల్తాన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ వైద్యం

**డయాలసిస్ కేంద్రానికి నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి**
**ఆసుపత్రి వద్ద నూతన బస్ షెల్టర్**
**మరమ్మత్తులను వెంటనే చేపట్టాలి**
**మంత్రి జూపల్లి కృష్ణారావు**





**కొల్లాపూర్ మే 16 (స్కైన్యూస్)** ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు నిరంతరం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు శనివారం ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రానికి నిరంతరం విద్యుత్ అందించేందుకు ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఆదేశించారు ఆసుపత్రిని పరిశీలించి రోగులతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆసుపత్రులలోనే అన్ని వసతులు కల్పించి రోగులకు నమ్మకం ఏర్పడేలా వైద్య సేవలు అందించేందుకు వైద్యులు సహకరించాలని కోరారు. వైద్య సేవలు వైద్య పరీక్షలు నాణ్యమైన మందులు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2018లో మంజూరైన వంద పడకల నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయని ఇందుకోసం 22 కోట్ల రూపాయలను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు త్వరలో దానిని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభిస్తారని మంత్రి జూపల్లి తెలిపారు. చిన్న చిన్న మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు దూర ప్రాంతాల నుండి వచ్చే రోగుల సౌకర్యార్థం ఆస్పత్రి వద్ద ఐదు లక్షల నిధులతో నూతన బస్సు షెల్టర్ నిర్మించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## వచ్చిన ధాన్యాన్ని వెంటనే ఆన్ లోడ్ చేయాలి: కలెక్టర్



**నారాయణపేట మే 16: (స్కైన్యూస్)** వరి కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం బస్తాలను వెంటనే లారీల్లో లోడ్ చేయించి కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శనివారం దామర గిద్ద మండలంలోని బాపన్ పల్లి ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఇంత వరకు ఎన్ని బస్తాల ధాన్యం కొనుగోలు చేశారని ఎంత మంది రైతులకు ధ్యానం డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయని అడిగి తెలుసుకున్నారు. త్వరిగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే డెంగ్యూ నివారణ

**పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక**



**బిజినేపల్లి మే 16 (స్కైన్యూస్)** డెంగ్యూ నివారణకు సమాజంలోని ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాలెం వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక కోరారు శనివారం గ్రామంలో డెంగ్యూ నివారణ దినోత్సవం ర్యాలీని ఆమె ప్రారంభించారు సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘటితంగా ప్రజలను చైతన్యం చేస్తూ దోమలను నివారించడం వల్ల డెంగ్యూను పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేకంగా ప్రతి మంగళవారం మరియు శుక్రవారం పొడి దినంగా పాటించి రహదారుల పరిశుభ్రతతో పాటు గృహాలలో మరియు పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలను శుభ్రం చేసుకోవాలని మురికిగుంటలు లేకుండా చూసుకోవాలని కోరారు. దోమలు ఇంటిలోకి ప్రవేశించకుండా దోమతెరలు ఆల్ అవుట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు ఇంట్లో ఉండే కూలర్ల నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కొబ్బరి బోండాలు మరియు పాత టైర్లు పూల కుండీలు డ్రమ్ములు కుండలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బాదం రాజేశ్వర్ దామగట్ల కుమార్ హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్ ఏఎన్ఎం గజవర్ధనమ్మ ఆశా వర్కర్లు జయమ్మ వరలక్ష్మి విజయ లీల గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసులు సిబ్బంది వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ధరల పెంపుతో సామాన్యులపై భారం...

**ఇంధన ధరలు తగ్గించే వరకు పోరాటం**
**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్**





**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం సామాన్యుల పై భారం పడేవిధంగా పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడం దారుణమని వాటిని తగ్గించే వరకు సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎం డి ఫయాజ్ హెచ్చరించారు శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చే విధంగా పనిచేస్తూ నిత్యవసర ధరలు మరియు పెట్రోల్ డీజిల్ ధరలు పెంపు వల్ల సామాన్యుల జీవిత ప్రమాణానికి ఆర్థిక ఇబ్బంది పడుతుందని మండిపడ్డారు. రవాణా ఖర్చులు పెరగడం వల్ల నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని రైతులకు వ్యవసాయ ఖర్చులు పెరిగి పంటలు సాగు చేయడం భారంగా మారిందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరల పెంపు వల్ల ఆటో కార్మికులు చిరు వ్యాపారులు కూలీలు ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారని వివరించారు కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరలపై విధిస్తున్న పనులను రద్దుచేసి ప్రజలకు ధరలు తగ్గించాలని కోరారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జి జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్ కుమార్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి బండి లక్ష్మీపతి నాయకులు సయ్యద్ ఖాజా భూపేష్ వంకేశ్వరం శీను కొత్త రామస్వామి రామచంద్రమ్మ రామకృష్ణ సత్యం విజయ్ వెంకటస్వామి శివ చెన్నయ్య సుధాకర్ కర్రన్న బుజ్జన్న సీతయ్య శివయ్య తదితరులు పాల్గొన్నారు

## ధరల పెంపు పేదలపై పెను భారం



**అచ్చంపేట మే 16( స్కై న్యూస్)** కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ మరియు డీజిల్ ధరను లీటర్ కు మూడు రూపాయలు పెంచడం పేదలపై పెను భారం మోపడమేనని సిపిఐ జిల్లా నాయకులు మారేడు శివశంకర్ మండిపడ్డారు శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ 5 రాష్ట్రాలలో ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత సామాన్యులపై పెను భారం మోపే విధంగా ధరలు పెంచడం వల్ల ఆటో కార్మికులు చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని మండిపడ్డారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగితే నిత్యవసర వస్తువులపై దాని ప్రభావం పడే ప్రమాదం ఉందని వెంటనే ఇంధన పన్నులను రద్దుచేసి ధరలను తగ్గించాలని కోరారు కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా నాయకురాలు తిరుపతమ్మ అలివేల బాలచంద్రమ్మ రేణుక నాయకులు సత్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు

## దోస్త్ ఐడితో నేరుగా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం

**ఎస్టీ విద్యార్థులకు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో అడ్మిషన్**
**కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీత**




**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** తెలంగాణ గిరిజన సంక్షేమ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ బిజీ కెమిస్ట్రీ మహిళల కళాశాలలో సెకండ్ ఫేస్ అడ్మిషన్లను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నీత తెలిపారు దీనికి సంబంధించి దోస్తు ఐడి కార్డుతో విద్యార్థులు నేరుగా కళాశాలకు వస్తే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు ఆన్లైన్ ప్రక్రియ ద్వారా కళాశాలలో అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని వివరించారు దోస్తు గుర్తింపు కార్డు ఉన్న విద్యార్థులు తక్షణమే కళాశాల సంప్రదించాలని కోరారు విద్యార్థులు మీసేవ లేదా ఆన్లైన్ సెంటర్లలో ఎలాంటి ఫీజులు చెల్లించవద్దని నేరుగా రిజిస్ట్రేషన్లు కళాశాలలోనే చేసుకోవాలని సూచించారు ఎస్టీలకు మాత్రమే సీట్లు ఉన్నందున ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు ప్రస్తుతం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో బిజెడ్, సీఎం జెడ్ సి, బిఏ, బీకాం, ఎంపీసీ, ఎంపీసీఎస్, అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ పీజీ కెమిస్ట్రీ కోర్సుల్లో ప్రవేశానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు దరఖాస్తు విషయంలో కళాశాలకు చెందిన 9703441345, 8125214019, 8008590318, 9959525459 నెంబర్ల ద్వారా సంప్రదించాలని కోరారు.

## యాదవుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలి...

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** నియోజకవర్గంలో యాదవుల ఆర్థిక అభివృద్ధికి అభివృద్ధి సహకార సమస్య ద్వారా నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఇటీవల తెలంగాణ రాష్ట్ర గొర్రెలు మరియు మేకల అభివృద్ధి సహకార సమైక్య చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన సరితా తిరుపతయ్యను కోరారు శనివారం ఆమెను కార్యాలయంలో పలువురు ఎమ్మెల్యేలతో కలిసి సన్మానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కులవృత్తులకు ప్రోత్సహించడంలో భాగంగా చేపట్టిన పథకాలను నాగర్ కర్నూల్ నియోజకవర్గం కి ప్రత్యేకంగా మంజూరు చేయాలని కోరారు

# జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సంధ్య

**డెంగ్యూపై అవగాహన కల్పించిన వైద్య సిబ్బంది**






**రంగారెడ్డి జిల్లా మే 16 స్కై న్యూస్** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం చించోడు గ్రామంలో జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సంధ్య భారతదేశంలో ప్రతి సంవత్సరం మే 16న నిర్వహించే జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ ర్యాలీని ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారి డాక్టర్ సంధ్య జెండా ఊపి ప్రారంభించారు హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు డెంగ్యూ వ్యాధి నివారణ, దోమల నిర్మూలనపై నినాదాలు చేస్తూ ర్యాలీని గ్రామంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ ఒక ప్రమాదకరమైన వైరల్ జ్వరమని, ఏడిస్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని తెలిపారు డెంగ్యూ లక్షణాలుగా అధిక జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, శరీర నొప్పులు, వాంతులు, చర్మంపై ఎర్రటి మచ్చలు కనిపిస్తాయని చెప్పారు కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాపాయం కూడా కలిగించవచ్చని హెచ్చరించారు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీటి ట్యాంకులు, పాత్రలకు మూతలు పెట్టాలని, పాత టైర్లు, కొబ్బరి చెక్కల్లో నీరు నిల్వ కాకుండా తొలగించాలని సూచించారు డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు డెంగ్యూపై అవగాహన పెంచుదాం దోమల పెరుగుదలను అరికడదాం ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం అని హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్వైజర్ శ్రీరామ, ఏఎన్ఎంలు లలిత, మధువాణి, ఆసుపత్రి సిబ్బంది శ్రీనివాసులు, మణెమ్మ, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విద్యా వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు

**శాస్త్ర సాంకేతికతతో పాటు ఆరోగ్య సేవలు**







**నాగర్ కర్నూల్ మే 16 (స్కైన్యూస్)** జనరేటివ్ ఏ వన్ తో విద్యా వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని జిల్లా ఫార్మసీ అధికారి లయన్స్ క్లబ్ కార్యదర్శి మలిపెద్ది సురేష్ కుమార్ అన్నారు శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ మరియు కామర్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏఐ కాన్ క్లైవ్ కార్యక్రమం తో పాటు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇమేజ్ జనరేషన్ డేటా అనాలసిస్ వంటి వాటిపై అవగాహన కల్పించారు అనంతరం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కంటి వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే గీతాంజలి మాట్లాడుతూ పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నటువంటి కళాశాలలో విద్యపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూనే ప్రజారోగ్య సేవలు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు విద్యార్థులు వైద్య సిబ్బంది లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

# త్వరితగత పరిష్కారానికి లోక్ అదాలత్....

**20న జాతీయ లోక్ అదాలత్**



**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** కోర్టులలో పెండింగ్లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని ప్రిన్సిపల్ డిస్టిక్ అండ్ సెషన్ కోర్టు జడ్జి రమాకాంత్ వివరించారు శనివారం జిల్లా కేంద్రంలో న్యాయమూర్తులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి ప్రజలు ముందుకు రావాలని ఈనెల 20న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 15 వేల కేసులు పెండింగ్లో ఉన్నాయని ప్రతి మూడు నెలలకు ఒకసారి లోకదాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా సివిల్ మరియు భూవివాదాలను మ్యాట్రిమోనియల్ కేసులకు రాజీ మార్గంలో పరిష్కారం చూపెడుతున్నట్లు వివరించారు. జిల్లాలోని కొల్లాపూర్ కల్వకుర్తి అచ్చంపేట ప్రాంతాలలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తూ మీడియేటర్లకు ప్రత్యేక శిక్షణ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేసులు ఎక్కువ కాలం కొనసాగితే సమయం మరియు డబ్బు వృధా అవుతుందని మానసిక ఒత్తిడి పెరుగుతుందని తెలిపారు రాజీ మార్గాలకు పోలీసు శాఖ కూడా సహకరించాలని ఆయన సూచించారు ఈ సమావేశంలో డిఎస్పి బుర్రి శ్రీనివాసులు ఎస్సై గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు ఆదివారం 17 మే 2026

## నాగులపల్లిలో త్రాగునీటి కోసం బోర్ మంజూరు చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

**సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోరుబావి ప్రారంభం**

**సమృద్ధిగా నీరు రావడంతో గ్రామస్థుల ఆనందం**



**రంగారెడ్డి జిల్లా మే 16: ( స్కై న్యూస్ )** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో బోరుబావిని మంజూరు చేశారు గ్రామ ప్రజలు, సర్పంచ్ విజ్ఞప్తి మేరకు ఈ బోరుబావి ఏర్పాటు చేయడం జరిగింది గ్రామ సర్పంచ్, నాయకులు, గ్రామ ప్రజల చేతుల మీదుగా బోరుబావి పనులను ప్రారంభించారు బోరుబావిలో సమృద్ధిగా నీరు రావడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల త్రాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే స్పందించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని గ్రామస్థులు కొనియాడారు త్రాగునీటి కొరతను తీర్చేందుకు చేపట్టిన ఈ చర్య గ్రామానికి ఎంతో ఉపయోగకరమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, ఉపసర్పంచ్ కిరణ్ గౌడ్, నాయకులు జయరాం గౌడ్, వార్డు సభ్యులు మొగుటం కుమార్, రజిత, లక్ష్మీ నరసింహ, స్వామి, బౌరయ్య, గోపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, నరసింహ, నారాయణ, సందీప్, రఘురాం రెడ్డి, కుమార్ గౌడ్, మహేష్, శ్రీధర్, జంగయ్య, చంద్రశేఖర్, శ్రీకాంత్, మల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి సహాయాకులకు అన్నప్రసాద పంపిణీ...

**పూజారి బూర్గుల నరసింహారావు సేవాతత్పరత...**



**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కు చెందిన బూర్గుల నరసింహారావు 2014 నుండి ప్రతి నెలలో ఒకరోజు రోగి సహాయకులకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అన్న ప్రసాద పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దత్త జయంతి, కార్తీక పౌర్ణమి, అమావాస్య, పౌర్ణమి ప్రత్యేక రోజులలో తప్పనిసరిగా నెలలో ఏదైనా ఒక రోజు 150 మందికి రోగి సహాయకులకు అన్నప్రసాదం, స్వీట్లు, మజ్జిగ, పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈరోజు వైశాఖ అమావాస్య పురస్కరించుకొని శనీ వారం నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న ప్రసాద పంపిణీ ,మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహతి, తులసి శర్మ , ఆదర్శ శర్మ, మల్లికార్జున్, రాము, గురునాథ్ గౌడ్, హెల్ప్ డెస్క్ఇంచార్జ్ టి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు తగ్గించాలి: సిపిఎం ధర్నా నిరసన...



**దేవరకద్ర అమరచింత మే 16 (స్కై న్యూస్);** పెంచిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలను తగ్గించాలని అమరచింత లో శనివారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో నిరసనకార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండలకార్యదర్శి వర్గ సభ్యులు యస్, అజయ్, టి. రాఘవేంద్ర లు మాట్లాడుతూ 14న అర్ధరాత్రి ప్రజలు నిద్రించిన తర్వాత పెట్రోల్ డీజిల్ ధరలను 3చొప్పున పెంచడం దారుణమని విమర్శించారు. 5రాష్ట్ర ల ఎన్నికల ముందు రేట్లు పెంచాబోమని ప్రగల్బాలు పలికిన బిజెపి కేంద్రం మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు ఇప్పుడు నోరు మెదపదం లేదని ఏద్దేవా చెశారు. ఇటీవల కమర్షియల్ సిలిండర్ 993కు పెంచడం తో 3000కు పెరిగిందని దింతో చిరు వ్యాపారుల నుండి పెద్ద పెద్ద హోటల్లు మూత బడ్డాయాని విమర్శించారు. మధ్యాహ్నం భోజనం గురుకులాల్లో సిలిండర్ల కొరతతో కట్టెల పొయ్యిలతోవంటలు వండే దుస్థితికి బిజెపి కారణం అని అన్నారు. రాబోయే రోజుల్లో పెట్రోల్ డీజిల్ సిలిండర్ ధరలను ఇంకా భారీగా పెంచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికైనా బిజెపి చేస్తున్న కుటిల రాజకీయలను ప్రజలు గమనిశీచి రానున్న రోజుల్లో ఉద్యమల ద్వారా బిజెపి కి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమం లొ సిపిఎం మండలనాయకులు బుచ్చన్న శ్యామ్ సుందర్. బేక్కేశీ విష్ణు. సాగర్. విజయ్.కె. రవిప్రకాష్. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఎంఈఓ మనోహర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

**శుభాకాంక్షలు తెలిపిన విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు**



**రంగారెడ్డి జిల్లా, మే 16 (స్కై న్యూస్):** ఫరూఖ్‌నగర్ మండల విద్యాధికారి (ఎంఈఓ) మనోహర్ పుట్టినరోజు సందర్భంగా పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్నేహితులు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు విద్యార్థుల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల పురోగతి కోసం నిరంతరం కృషి చేస్తూ విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఎంఈఓ మనోహర్ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు ఈ సందర్భంగా జర్నలిస్టు అల్వాల దర్శన్ గౌడ్ మాట్లాడుతూ మనోహర్‌కు ఆయురారోగ్యాలు, ఆనందం, విజయాలు కలగాలని కోరుతూ ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## వైభవంగా శ్రీశనేశ్వర జయంతి వేడుకలు...

**వేలాదిగా శనీశ్వర స్వామిని దర్శించిన భక్తులు**

**బిజినపల్లి మే 16 (స్కై న్యూస్):** శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖమాసం మాసం కృష్ణ పక్షం అమావాస్య శనివారం, నాడు మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనీశ్వర జయంతి సందర్భంగా అమావాస్య తిథిలోశనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు, అష్టోత్తరపూజలు, అర్చనలునిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి వేలాది భక్తులు స్వామివారిని దర్శించి కృపాకటాక్షాలు పొందారని అన్నారు. ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు




స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు, దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ




చేశారు. ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి...

**జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** డెంగ్యూ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి కోరారు శనివారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఆవరణలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం డెంగ్యూ కారక వైరస్ కలిగిన ఏడిఎస్ దోమ కాటు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి జ్వరం తలనొప్పి గుళ్ళు నొప్పులు వాంతులు విరేచనాలతో విస్తరిస్తుందని వివరించారు లక్షణాలు ప్రాథమిక దశలోనే గుర్తించి పరీక్షలు చేయించుకోవడం ద్వారా సులభంగా తగ్గించుకోవచ్చని



అన్నారు. డెంగ్యూ ను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం అవుతుందని ప్రజలు వర్షాకాలంలో జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు ప్రతి శుక్రవారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు డ్రైడే నిర్వహించాలని సూచించారు. ప్రత్యేకంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని అనవసర వస్తువులు ఇంట్లో ఉంచుకోరాదని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృష్ణమోహన్ డాక్టర్ ప్రదీప్ వైద్యాధికారులు డాక్టర్ వాణి డాక్టర్ సృజన పర్యవేక్షణ సిబ్బంది శ్రీనివాసులు ఆప్కాల మీకు అధికారి కొత్ర బాలాజీ ఎంపీహెచ్వోలు కసియోద్దీన్ రాజేష్ జిల్లా ఫార్మసీ అధికారి సురేష్ కుమార్ ల్యాబ్ టెక్నీషియన్ కళ్యాణ్ కృష్ణారావు హెల్త్ అసిస్టెంట్లు రాజ వర్ధన్ రెడ్డి మల్లేష్ ఏఎన్ఎంలు కవిత సరస్వతీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన సాయి బండి భగీరథను అరెస్టు చేయాలి కఠినంగా శిక్షించాలి....

**దేవరకద్ర అమరచింత మే 16 (స్కై న్యూస్);** అమరచింత మండల కేంద్రంలో మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐఎంఎల్ మాస్ లైన్ పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, డివిజన్ నాయకులు కే రాజన్న పట్టణ కార్యదర్శి మస్ల మని మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మహిళలపై నిత్యం అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వాలు వీటిని అరికట్టడంలో విఫలం ఇవ్వడమే కాకుండా ఉన్నోడిదే చట్టం అన్న చందంగా ఉన్నవాడు ఏమి చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో సాయి బండి భగీరథ మైనర్ బాలిక పై చేసిన లైంగిక దాడి సమాజానికంతటికి తెలిసినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు



బండి భగీరథు ని అరెస్ట్ చేయడంలో జాప్యం జరుగుతున్నది అన్నారు. దీనికంతటికి కారణం భగీరథకు బిజెపి పార్టీ రాజకీయ పలుకుబడి ఉండడమే ధనవంతులకు, పేదలకు, తేడాల వల్ల ఇది జరుగుతుందని మేము భావిస్తున్నాం అన్నారు. దేశంలో రాష్ట్రంలో జరిగే అగైత్యాలను ప్రభుత్వాలు అరికట్టడంలో చొరవ తీసుకోవాలని ప్రజలకు రక్షణగా ఉండాలని కోరుతున్నాం అన్నారు. ఈ లైంగిక దాడిలో పాల్గొన్న బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అమరచింత మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై అదే విధంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన తెలియజేస్తూ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ కమిటీ నాయకులు, కురుమన్న జిలాని భక్తి, విజయ్ తాజుద్దీన్ గీత భాయ్ రామ్ చందర్ రామచందర్ జి, భీమన్న, రంగన్న శీను తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ

**నారాయణపేట మే 16: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం అమావాస్య సందర్భంగా అఖిల భారత అయ్యప్ప సేవా సమితి, కాకర్ల సురేష్ వెల్ఫర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండు వేసవిని పురస్కరించుకుని పాదచారులకు మజ్జిగ వితరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని అయ్యప్ప గురు స్వాములు మనోహర్ ప్రసాద్ గౌడ్, కే. భీమయ్య గౌడ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి, కాకర్ల సురేష్ వెల్ఫర్ ట్రస్ట్ సంయుక్తంగా చలివేంద్రం నిర్వహిస్తూ ప్రజల దాహం తీర్చడం అభినందనీయం అన్నారు. వారికి ప్రజా సేవ చేసే శక్తి స్వామివారు ప్రసాదించాలని కోరారు.

**గురు స్వాములకు ఘన సన్మానం**

మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రారంబించిన గురు స్వాములు




రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మనోహర్ ప్రసాద్ గౌడ్, మాజీ సర్పంచ్ కే. భీమయ్య, కాకర్ల భీమయ్య, కూరగాయల వ్యాపారి శశికాంత్



యాదవ్, శంభులింగం లను సురేష్ వెల్ఫర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

## కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి...

**వివరాలను రికార్డులలో సక్రమంగా నమోదు చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



**అచ్చంపేట మే 16 (స్కైన్యూస్)** మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని జిల్లా కలెక్టర్ హేమంతా కేశవ్ పాటిల్ సూచించారు శనివారం మండల పరిధిలోని చందాపూర్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పనులను పరిశీలించి ధాన్యం కొనుగోలు రికార్డుల నిర్వహణ సమస్యలను తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యతతో ధాన్యాన్ని తరలించాలని కోరారు. నిర్వాహకులు హమాలీల సమస్యతో పాటు గన్ని బ్యాగుల సమస్యను పరిష్కరించి రైతుల ఇబ్బందులు తొలగించాలని కొనుగోలు వివరాలను రికార్డులలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకే ప్రతి గింజలు మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని అన్నారు కొనుగోలు కేంద్రాలలో రైతులకు మౌలిక వసతులను త్రాగునీటి సమస్యను విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఆర్డీవో యాదగిరి తోపాటు రెవెన్యూ మార్కెటింగ్ అధికారులు పలువురు రైతులు పాల్గొన్నారు

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి,...

**జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి**




**నాగర్ కర్నూల్ మే 16 (స్కై న్యూస్)** గ్రామాలలోని యువత బాధ్యతలతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించే తత్వం అలబడుతుందని న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు శనివారం తాడూరు మండలం ఐతోల్ గ్రామంలో నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ సురక్షిత్ భవిష్య కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశానికి గురికాకుండా ప్రశాంతత వల్ల కేసులకు దూరంగా ఉండవచ్చు అని తెలిపారు. బాధితులకు న్యాయ సహాయం అందించేందుకు న్యాయస్థానాలు ప్రత్యేకంగా న్యాయవాదులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు యువత అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంధ్య ఉపసర్పంచ్ లక్ష్మి మాజీ సర్పంచ్ ఇందుమతి మాజీ ఉపసర్పంచ్ హుస్సేన్ ప్రభుత్వ న్యాయవాది శేష సాయి తో పాటు ప్రజలు పాల్గొన్నారు

# డీహైడ్రేషన్ నుంచి కాపాడటంలో దీని తర్వాతే ఏదైనా

వేసవి కాలం వచ్చేసింది. ఎండలు తీవ్రమవుతున్న కొద్దీ మన శరీరంలోని నీటి శాతం చెమట రూపంలో వేగంగా తగ్గిపోతుంది. కేవలం నీళ్లు తాగడం మాత్రమే కాకుండా, మనం తీసుకునే ఆహారం ద్వారా కూడా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవచ్చు. వేసవి పండ్ల గురించి మాట్లాడేటప్పుడు అందరికీ మొదటగా గుర్తొచ్చేది 'పుచ్చకాయ'. దాదాపు 91 నుండి 92 శాతం నీటిని కలిగి ఉండే పుచ్చకాయ, ఎండల బారి నుండి మనల్ని రక్షించే అద్భుతమైన ఫలమని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పుచ్చకాయ కేవలం దాహాన్ని తీర్చడమే కాకుండా, శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లను అందిస్తుంది. ఎండలో తిరిగేటప్పుడు వచ్చే అలసట, తలనొప్పి వంటి సమస్యలను నివారించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. పుచ్చకాయలో ఉండే అత్యధిక నీటి శాతం మరియు ఎలక్ట్రోలైట్లు శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడతాయి. ఎండ వేడి వల్ల కలిగే అలసట, మైకము వంటి లక్షణాలను ఇది తగ్గిస్తుంది. ఇందులో ఉండే విటమిన్ సి మరియు లైకోపిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎండ వల్ల దెబ్బతినే చర్మాన్ని రక్షించి, చర్మం తాజాగా ఉండేలా చేస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారు కూడా దీనిని నిరభ్యంతరంగా తీసుకోవచ్చు. ఇది కడుపుని నిండుగా ఉంచుతూనే శరీరాన్ని తేలికగా ఉంచుతుంది. పుచ్చకాయను ఉదయం పూట స్నాక్‌లా తీసుకోవడం లేదా పండ్ల ముక్కలతో కలిపి సలాడ్‌లా తీసుకోవడం మంచిది. ఎటువంటి చక్కెర కలపకుండా తాజాగా జ్యూస్ చేసుకుని తాగవచ్చు. దీనికి కొద్దిగా పుదీనా ఆకులు కలిపితే రుచితో పాటు చలువ కూడా చేస్తుంది. వేసవిలో వచ్చే ఇతర పండ్లైన కర్బూజ (90%), స్ట్రాబెర్రీ (91%), ఆరెంజ్ (87%) మరియు పైనాపిల్ (86%) లలో కూడా నీటి శాతం ఎక్కువే ఉన్నప్పటికీ, పుచ్చకాయ వీటన్నింటికంటే ముందంజలో ఉంది. అయితే, చాలామంది పండ్ల జాబితాలో దోసకాయను మర్చిపోతుంటారు. నిజానికి దోసకాయలో 95 నుండి 96 శాతం వరకు నీరు ఉంటుంది. ఇందులో ఉండే పొటాషియం వంటి ఖనిజాలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు డీహైడ్రేషన్ బారిన పడకుండా శరీరాన్ని అద్భుతంగా కాపాడతాయి. కాబట్టి పుచ్చకాయతో పాటు దోసకాయను కూడా మీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల వేసవి తాపాన్ని సులభంగా అధిగమించవచ్చు.

# తక్షణ శక్తికోసం ఏది తినాలి?

మన నిత్య జీవితంలో పనులు చేసుకోవడానికి అవసరమైన కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు మన ఆహారం ద్వారా అందుతాయి. అయితే మనం తీసుకునే ఆహారం శరీరానికి ఏ సమయంలో, ఎలా శక్తిని ఇస్తుందనేది చాలా ముఖ్యం. కొన్నిసార్లు మనకు తక్షణమే ఉత్సాహం రావాల్సి ఉంటుంది. మరికొన్ని సందర్భాల్లో రోజంతా పని చేయడానికి స్థిరమైన శక్తి అవసరమవుతుంది. అటువంటి సమయాల్లో అరటిపండ్లు, ఖర్జూరాలు మనకు అద్భుతమైన ఎంపికలుగా నిలుస్తాయి. ఈ రెండూ శక్తిని అందించినప్పటికీ, వాటి పోషక విలువలలో ఉండే స్వల్ప తేడాల వల్ల వాటిని తీసుకునే సమయం వేరుగా ఉండాలి. అరటిపండ్ల విషయానికి వస్తే, వీటిలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఒక మధ్యస్థ పరిమాణపు అరటిపండులో సుమారు 100 నుండి 150 కేలరీలు ఉంటాయి. వీటిలో సహజ చక్కెరలతో పాటు పిండి పదార్థాలు ఉండటం వల్ల శరీరానికి నిరంతరాయంగా, స్థిరమైన శక్తిని అందిస్తాయి. అంతేకాకుండా అరటిపండ్లలో ఉండే పొటాషియం, విటమిన్ బి6, విటమిన్ సి వంటి పోషకాలు శరీర అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా కండరాల పనితీరును మెరుగుపరచడంలో పొటాషియం కీలక పాత్ర పోషిస్తుంది. ఇది వ్యాయామం చేసే సమయంలో వచ్చే కండరాల తిమ్మిర్లను తగ్గించడానికి సహాయపడుతుంది.



మరోవైపు ఖర్జూరాలు తక్షణ శక్తిని అందించడంలో మేటిగా నిలుస్తాయి. కేవలం 3 నుండి 4 ఖర్జూరాలలో 90 నుండి 120 కేలరీలు లభిస్తాయి. వీటిలో సహజ చక్కెరలు పుష్కలంగా ఉండటం వల్ల నీరసంగా ఉన్నప్పుడు లేదా ఉపవాసం ఉన్నప్పుడు తీసుకుంటే వెంటనే ఉత్సాహం వస్తుంది. ఖర్జూరాల్లో చక్కెరతో పాటు ఫైబర్, ఐరన్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు కూడా ఉంటాయి. ముఖ్యంగా రక్తహీనత సమస్యతో బాధపడేవారికి ఖర్జూరాలు ఒక అద్భుతమైన పోషకాహారంగా పనిచేస్తాయి. తీవ్రమైన శారీరక శ్రమ చేసేవారికి కూడా ఇవి తక్షణ ఇంధనంలా ఉపయోగపడతాయి. షుగర్ వ్యాధిగ్రస్తులు పండ్ల ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి. అరటిపండ్లు మధ్యస్థ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం వల్ల ఇవి రక్తంలోని చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచవు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు వీటిని సాధారణ పరిమాణంలో తీసుకోవడం వల్ల జీర్ణక్రియకు, పేగు ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. ఖర్జూరాలకు గ్లైసెమిక్ ఇండెక్స్ చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది చక్కెర స్థాయిని వేగంగా పెంచుతుంది. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు ఖర్జూరాలకు దూరంగా ఉండటం మంచిది. ఒకవేళ తీసుకోవాలనుకుంటే ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకోవాలి, అందులోని ఫైబర్ చక్కెర నియంత్రణకు కొంతవరకు తోడ్పడుతుంది. మన శరీర అవసరాలను బట్టి ఈ రెండింటినీ ఎంచుకోవాలి. సులభంగా చెప్పాలంటే, మీరు వెంటనే రీఛార్జ్ అవ్వాలి అనుకుంటే ఖర్జూరాలు తీసుకోవాలి. అదే మీరు వ్యాయామం చేయాలన్నా లేదా రోజంతా చురుగ్గా ఉండాలన్నా అరటిపండ్లు తీసుకోవడం ఉత్తమం. ఈ రెండింటిలోనూ విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండటం వల్ల ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. మీ దైనందిన జీవితంలో వీటిని సరైన పద్ధతిలో చేర్చుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చు.



# ఖాళీ కడుపుతో నిమ్మరసంలో ఇది కలిపి తాగుతున్నారా?

నేటి వేగవంతమైన జీవితంలో ఆరోగ్యంగా ఉండటం ఒక సవాలుగా మారింది. ఇటువంటి పరిస్థితులలో కొన్ని చిన్న చిన్న చిట్కాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. వాటిలో ఒకటి, పరగడుపున నిమ్మకాయ, తేనె కలిపిన నీటిని తాగడం. ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రారంభించడానికి చాలామంది ఉదయాన్నే నిమ్మరసం-తేనె నీటిని ఎంచుకుంటారు. ఇది ఒక పాతకాలపు పద్ధతి అయినప్పటికీ, దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల వల్ల నేటికీ ప్రాచుర్యం పొందుతోంది. కానీ, సరైన పద్ధతిలో పాటించకపోతే, దీని వల్ల కలిగే లాభనష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి నీటిలో నిమ్మరసం, తేనె కలపడం వల్ల శరీరంలోని అదనపు కొవ్వు కరుగుతుంది. బరువు తగ్గడానికి ఒక దివ్యౌషధం లాంటిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. నోటిలోని బ్యాక్టీరియాను చంపడం ద్వారా నోటి దుర్వాసన సమస్యను తగ్గిస్తుంది. నిమ్మరసం కాలేయాన్ని శు భ్రపరచడానికి సహాయపడుతుంది. మీ కాలేయాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి, ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగండి. ఆరోగ్య ప్రయోజనాలు: నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్ల నుండి శరీరాన్ని రక్షించడమే కాకుండా, సీజనల్ వ్యాధులు దరిచేరకుండా చూస్తుంది. శరీరంలోని వ్యర్థాల, టాక్సిన్లను తొలగించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది. దీనివల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చాలా మంది ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో నిమ్మరసం తాగుతారు. పరిమిత పరిమాణంలో తీసుకుంటే ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ఖాళీ కడుపుతో తాగడం వల్ల ప్రయోజనానికి బదులుగా హాని జరగవచ్చునని నిపుణులు చెబుతున్నారు. నిమ్మరసం ఆరోగ్యానికి మంచిదే అయినప్పటికీ, దానిని తీసుకునే విధానంలో కొన్ని నియమాలు పాటించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవారు పరగడుపున నిమ్మరసం తాగడం వల్ల కడుపులో మంట వచ్చే అవకాశం ఉంది. వీరు అల్పాహారం చేసిన 40 నిమిషాల తర్వాత తీసుకోవడం మంచిది. భోజనానికి ముందు లేదా తిన్న వెంటనే దీనిని తాగకూడదు. అలా చేస్తే మనం తిన్న ఆహారంలోని పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించలేదు. నిమ్మరసం నీరు ఒక అద్భుతమైన ఆరోగ్య పానీయం. అయితే పైన పేర్కొన్న జాగ్రత్తలు పాటిస్తూ దీనిని క్రమం తప్పకుండా తీసుకుంటే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# బిజినెస్

## అత్యంత కనిష్టానికి పడిపోయిన రూపాయి.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్



భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రూపాయి విలువ అత్యంత కనిష్టానికి పతనమవడం, క్రూడాయిల్ ధరలు పెరగడం మార్కెట్లపై దుష్ప్రభావం చూపింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 160.73 పాయింట్లు (0.21 శాతం) నష్టపోయి 75,237.99 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ50 కూడా 46.10 పాయింట్లు (0.19 శాతం) నష్టపోయి 23,643.50 వద్ద ముగిసింది. రూపాయి విలువ తగ్గడం, చమురు ధరలు పెరుగుదల, ద్రవ్యోల్బణం పెరుగుతుందనే భయం వంటివి ఇన్వెస్టర్లపై ప్రభావం చూపాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగడం, హోర్ముజ్ జలసంధి పూర్తి స్థాయిలో తెరుచుకోకపోవడం వంటివి కూడా ఇందుకు కారణాలు. ఈ కారణాలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 109 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. మరోవైపు భారతీయ రూపాయి అత్యంత కనిష్ట స్థాయికి చేరింది. డాలర్‌తో రూపాయి విలువ 96.05 వద్ద ట్రేడవుతోంది. అంతకుముందు ఇది 95.9575 వద్ద కొనసాగింది. రూపాయి అత్యంత తక్కువ స్థాయికి చేరుకోవడం కూడా మార్కెట్లపై ప్రభావం చూపింది. రూపాయి ఇంత తక్కువ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. ఈ రోజు 0.3 శాతం తగ్గింది. చమురు ధరల పెరుగుదల, విదేశీ ద్రవ్యం అధికం కావడం, పశ్చిమాసియాలో అస్థిరత వంటివి రూపాయి పతనానికి కారణాలు. ఇండియా చమురు దిగుమతులపైనే ఎక్కువగా ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అలాగే, అమెరికా వడ్డీ రేట్లు, మారక నిల్వలు తగ్గడం కూడా కారణాలుగా చెప్పుకోవచ్చు.

## మేక్‌మైట్రిప్ కొత్త అప్డేట్.. వాయిస్‌తోనే బుకింగ్!




భారతదేశంలోని ప్రముఖ ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ మేక్‌మైట్రిప్ తన ఏఐ బేస్డ్ ట్రావెల్ అసిస్టెంట్ 'మైరా'లో కొత్త అప్‌గ్రేడ్‌ను ప్రవేశపెట్టింది. ఈ అప్‌డేట్ ముఖ్య ఉద్దేశ్యం.. వినియోగదారుల బుకింగ్ ప్రక్రియను పూర్తిగా సులభతరం చేసి, సెర్చింగ్ నుంచి చెల్లింపు వరకు మొత్తం ఒకే ఇంటర్‌ఫేస్‌లో పూర్తి చేయగలిగేలా చేయడం. అవసరమైతే వాయిస్ ఆధారిత విధానంలో కూడా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చు. 'మైరా 2.0' ఇప్పుడు సాధారణ సెర్చ్‌లను మాత్రమే కాకుండా, చాలా అవసరాలకు ఉపయోగపడుతుంది. క్లిష్టమైన ప్రయాణ అభ్యర్థనలను కూడా అర్థం చేసుకుని పరిష్కారం చూపుతుంది. ఉదాహరణకు.. కుటుంబ ప్రయాణాల కోసం ప్రత్యేక అవసరాలు ఉన్న హోటల్స్, వృద్ధుల కోసం సౌకర్యాలు లేదా వీసా సంబంధిత సమాచారం వంటి అంశాలను ఒకే చోట అందిస్తుంది. దీంతో వినియోగదారులు అనేక వెబ్‌సైట్లను పరిశీలించాల్సిన అవసరం లేకుండా, ఒకే వేదికపై పూర్తి సమాచారం పొందగలుగుతారు. ఈ కొత్త వెర్షన్‌లో.. వాయిస్ సపోర్ట్ కూడా ఉంది. తెలుగు సహా ఎనిమిది భాషల్లో.. వాయిస్ ద్వారా సెర్చ్, ఎంపికలు, బుకింగ్ వంటివి పూర్తి చేయవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వాయిస్ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల, ఈ ఫీచర్ మరింత ఉపయోగకరంగా ఉంటుంది. అంతే కాకుండా.. వినియోగదారులు తమ పాస్‌పోర్ట్ లేదా ఇతర డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తే, వాటి వివరాలను ఆటోమేటిక్‌గా గుర్తించి బుకింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. మరో ముఖ్యమైన డెవలప్మెంట్ ఏమిటంటే.. చెల్లింపు ప్రక్రియను కూడా సంభాషణలోనే పూర్తి చేయగలగడం. వినియోగదారులు సెర్చ్ చేయడం, ఎంపిక చేయడం, కన్ఫర్మ్ చేయడం,పేమెంట్ చేయడం వరకు అన్ని దశలను ఒకే ఇంటర్‌ఫేస్‌లో పూర్తి చేయవచ్చు. అదేవిధంగా, బుకింగ్ మధ్యలో కూడా వినియోగదారులు ప్రశ్నలు అడిగి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు, దీంతో ప్రక్రియ మధ్యలో ఆగిపోకుండా కొనసాగుతుంది.

# 2026 చివరి నాటికి.. టాటా కొత్త తరహా కార్లు!

టాటా మోటార్స్ భారత మార్కెట్లో కొత్త తరహా వాహనాలను ప్రవేశపెట్టేందుకు విస్తృత ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇందులో ముఖ్యమైనది ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్యాసింజర్ వెహికల్ లాంచ్ చేయడం. దీనిని కంపెనీ 2026 చివర్లో లేదా 2027 ప్రారంభంలో దేశీయ విఫణిలోకి ప్రవేశపెట్టనుంది. భారత ప్రభుత్వం ప్రస్తుతం పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఐ20 (20% ఇథనాల్ మిశ్రమం) అమలులో ఉండగా, భవిష్యత్తులో ఐ85, చివరికి ఐ100 వరకు చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మార్పులకు అనుగుణంగా వాహన తయారీ సంస్థలు కూడా తమ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాయి. టాటా మోటార్స్ 2023 నుంచే తమ వాహనాలను ఐ20 ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేస్తోంది. అంతే కాకుండా.. సంస్థ ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, హైడ్రోజన్ వంటి పర్యావరణహిత సాంకేతికతలపై కూడా దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలను ప్రదర్శించింది. ఇందులో ముఖ్యంగా టాటా పంచ్ ఫ్లెక్స్-ఫ్యూయల్ కాన్సెప్ట్ ఆకర్షణీయంగా నిలిచింది. టాటా పంచ్ ఫ్లెక్స్-ఫ్యూయల్ కాన్సెప్ట్ కారు 1.2 లీటర్ త్రీ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌నే ఉపయోగించినప్పటికీ, ఐజఖ, ఫ్యూయల్ ఇంజెక్షన్ సిస్టమ్, ఎగ్జాస్ట్ వ్యవస్థలో మార్పులు చేసి ఇథనాల్ మిశ్రమాలను తట్టుకునేలా రూపొందించారు. ఇది పెట్రోల్‌తో పాటు అధిక




శాతం ఇథనాల్ మిశ్రమంతో కూడా సమర్థంగా పనిచేయగలదు. ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనం అంటే పెట్రోల్, ఇథనాల్ లేదా ఈ రెండింటి మిశ్రమంతో నడిచే వాహనం. ఎథనాల్ అనేది చెరకు, మొక్కజొన్న వంటి పంటల నుంచి తయారయ్యే పర్యావరణహిత బయోఫ్యూయల్. ఇది సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే తక్కువ కాలుష్యాన్ని ఉత్పత్తి చేస్తుంది.

# వాహనదారులకు షాక్.. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన కేంద్రం

దేశవ్యాప్తంగా వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం భారీ షాకిచ్చింది. దాదాపు నాలుగేళ్ల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు సగటున రూ.3 పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. పెరిగిన ధరలతో దేశ రాజధాని న్యూఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.97.77, డీజిల్ రూ.90.67కి పెరిగింది. హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్‌పై రూ.3.39, డీజిల్‌పై రూ.3.26 వరకు పెరిగింది. దీంతో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర రూ.110.89, డీజిల్ ధర రూ.98.96కి చేరింది. ఏపీలో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14 పెరిగింది. ఇక ముంబైలో పెట్రోల్ ధర రూ.106.68, డీజిల్ ధర రూ.95.13కి చేరింది. చెన్నైలో పెట్రోల్ ధర రూ.10.3.67, డీజిల్ ధర రూ.95.25కి పెరిగింది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా ఆయిల్ కంపెనీలపై భారం పడుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కానీ ప్రధాని మోదీ పొదుపు మంత్రం పాటించాలని చెప్పిన రెండు మూడు రోజుల్లోనే ఈ ధరలు పెరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు ఇంధన ధరల పెంపుతో రవాణా ఖర్చులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. తద్వారా నిత్యవసర వస్తువుల ధరలు, ప్రయాణచార్జీలు తదితర రంగాలపై దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంచనా



# మార్ష్ తుఫాన్ ఇన్నింగ్స్.. చెన్నైపై లక్నో ప్రతీకార విజయం..!

ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన జట్లకు పోటీలో లేని జట్లు షాక్‌లు ఇస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు ధర్మశాలలో ముంబై ఇండియన్స్ ఝలక్ ఇవ్వగా.. విజయంతో ముందంజ వేయాలనుకున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను లక్నో సూపర్ జెయింట్స్ ఓడించింది. ఆకాశ్ సింగ్(3-26) విజృంభణతో 187కు సీఎస్కే పరిమితమవ్వగా.. ఛేదనలో మిచెల్ మార్ష్(90) తుఫాన్ ఇన్నింగ్స్‌తో లక్నోను గెలుపు దిశగా నడిపాడు. వెంటవెంటనే మూడు వికెట్లు పడినా.. ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు ప్రత్యర్థికి అవకాశమివ్వలేదు. కంబోజ్ ఓవర్లో పూరన్ నాలుగు సిక్సర్లతో లక్నో ప్రతీకార విక్టరీ సాధించగా... చెన్నై ఐదో స్థానం వద్దే ఆగిపోయింది. పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ సమీకరణాలు ఆసక్తి రేపుతున్నాయి. జోరు మీదున్న జట్లు ముందంజ వేస్తాయనుకుంటే అనూహ్యంగా కంగుతింటున్నాయి. శుక్రవారం లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో చెన్నై సూపర్ కింగ్స్ చిత్తుగా ఓడింది. విజయంతో నాలుగో స్థానానికి ఎగబాకాలనుకున్న సీఎస్కే ఆశలకు లక్నో చెక్ పెట్టింది. 188 పరుగుల ఛేదనలో లక్నో ఓపెనర్లు దంచికొట్టారు. మిచెల్ మార్ష్(90), ఇంప్యాక్ట్ సబ్ జోష్ ఇంగ్లిస్(36)లు పోటాపోటీగా ఆడారు. చెన్నై ప్రధాన పేసర్ అన్షుల్ కంబోజ్‌ను ఉతికేసిన మార్ష్ 5వ ఓవర్లో నాలుగు సిక్సర్లు, ఫోర్‌తో 28 రన్స్ పిండుకున్నాడు. మార్ష్ 28 బంతుల్లోనే అర్ధ శతకం సాధించగా పవర్ ప్లేలోనే లక్నో స్కోర్ 80 దాటింది. వీరబాదుడుతో లక్ష్యాన్ని కరిగిస్తున్న ఈ జోడీని ముకేశ్ చౌదరీ విడదీశాడు. ఇంగ్లిస్‌ను ఔట్ చేయడంతో 135 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే మార్ష్ రనౌటవ్వగా.. అబ్దుల్ సమద్(7)ను బౌల్డ్ చేసిన స్పెన్సర్ సీఎస్కే శిబిరంలో ఆశలు రేపాడు. టపటపా మూడు వికెట్లు పడంతో లక్నో స్కోర్ వేగానికి బ్రేకులు పడ్డాయి. అప్పటికే అవసరమైన పరుగులు తక్కువే కావడంతో ముకుల్ చౌదరీ(13 నాటౌట్), నికోలస్ పూరన్(32 నాటౌట్)లు దంచేశారు. కంబోజ్ వేసిన 17వ ఓవర్లో తొలి నాలుగు బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపిన పూరన్ లక్నోకు 7 వికెట్ల విజయాన్ని అందించాడు.





**కార్తిక్ హాఫ్ సెంచరీ**

ప్లే ఆఫ్స్ రేసులో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ భారీ స్కోర్‌తో లక్నో సూపర్ జయింట్స్‌కు సవాల్ విసిరింది. ఆకాశ్ సింగ్(3-26) ధాటికి టాపార్డర్ విఫలమైనా కుర్రాడు కార్తిక్ శర్మ(71) మెరుపు అర్ధ శతకంతో లక్నో బౌలర్లను బెంబేలెత్తించాడు. ప్రధాన ఆటగాళ్లు ఔటైనా ఒత్తిడిలోనూ గొప్ప ఇన్నింగ్స్ ఆడిన కార్తిక్ భారీ స్కోర్‌కు బాటలు వేశాడు. ఆఖర్లో శివం దూబే(32 నాటౌట్) ధనాధన్ ఆడడంతో స్కోర్ 180 దాటింది. ప్రిన్స్ యాదవ్‌ను ఉతికేస్తూ 6, 4, ,4, 6తో దూబే రెచ్చిపోగా సీఎస్కే నిర్ణీత ఓవర్లలో వికెట్ల నష్టానికి రన్స్ చేసింది.



# స్పోర్ట్స్

## పాపం అర్జున్ టెండూల్కర్.. జట్టు మారినా?



ఐపీఎల్-2026లో లక్నో సూపర్ జెయింట్స్ తరపున అరంగేట్రం కోసం ఎదురు చూస్తున్న సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. లక్నో ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో శుక్రవారం ఏకానా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అర్జున్ అవకాశం? దక్కుతుందని అంతా భావించారు. కానీ లక్నో మేనెజెమెంట్ మరోసారి అతడిని బెంచ్‌కే పరిమితం చేసింది. ఆకాష్ మహారాజ్ సింగ్, యయాంక్ యాదవ్ వంటి యువ పేసర్లను ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకొచ్చిన లక్నో.. అర్జున్‌ను మాత్రం పరిగణలోకి తీసుకోలేదు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్‌లో ఉన్న అర్జున్.. ఐపీఎల్ 2026 కోసం జరిగిన ట్రేడింగ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టులోకి వచ్చాడు. కానీ ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో ఆడే అవకాశం దక్కలేదు. సీజన్ తుది దశకు చేరుకున్నప్పటికి అర్జున్‌కు అవకాశమివ్వకపోవడాన్ని నెటిజన్లు తప్పుపడుతున్నారు. ఈ ఏడాది సీజన్‌లో లక్నోకు ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. కనీసం? ఆఖరి మ్యాచ్‌లలోనైనా అర్జున్‌ను ఆడిస్తారా లేదా వేచి చూడాలి. 2023లో ముంబై ఇండియన్స్ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన అర్జున్.. ఇప్పటివరకు కేవలం మూడు వికెట్లు మాత్రమే పడగొట్టాడు. ముంబై జట్టులో ఉన్నప్పుడు కూడా అర్జున్ ఎక్కువగా బెంచ్‌కే పరిమితమయ్యాడు.

# మహాకాళిలో రోహిత్ సరాఫ్




బుల్లితెర ధారావాహికలతో పాటు పలు విజయవంతమైన చిత్రాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఉత్తరాది యువతలో క్రేజ్ సంపాదించుకున్నారు రోహిత్ సరాఫ్. తాజాగా ఆయన డివోషనల్ ఫాంటసీ థ్రిల్లర్ 'మహాకాళి'లో కీలక పాత్ర పోషిస్తున్నారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో 'హను-మాన్'ఫేం ప్రశాంత్‌వర్మ నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ నిర్మాణ దశలోనే ఆసక్తిని రేకెత్తిస్తున్నది. అక్షయ్‌ఖన్నా, భూమిశెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ప్రశాంత్‌వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా భారతీయ ఆధ్యాత్మిక, పౌరాణిక మూలాలతో ముడిపడిన కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఇందులో రోహిత్ సరాఫ్ పాల్గొంటున్నారు. ఈ సినిమాలో భాగం కావడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తన సోషల్‌మీడియా ఖాతాలో ఓ పోస్టర్‌ను పంచుకున్నారు.

# రామ్ బుజ్జి మైదానంలో అడుగుపెడితే!



అగ్ర కథానాయకుడు రామ్‌చరణ్ నటిస్తున్న పానిండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీప్రియులంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పానిండియా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచే విజువల్ వండర్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వెంకట సతీశ్ కిలారు నిర్మాత. ఈ నెల 18న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ని ముంబయిలో ఘనంగా విడుదల చేయనున్నారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది.వీశీజఅవం ఈ నేపథ్యంలో ఇందులో 'మీర్జాపూర్'ఫేం దివ్యేందుశర్మ పోషిస్తున్న 'రామ్ బుజ్జి' పాత్రను పరిచయం చేస్తూ ఓ వీడియోను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. క్రికెట్ మైదానంలో రామ్‌బుజ్జి ఎంట్రీ ఇచ్చిన తీరు, అతని బాడీ లాంగ్వేజ్, రగ్గడ్ యాటిట్యూడ్.. ఇవన్నీ పాత్రలోని ఇంటెన్సిటీని, కథలోని ప్రాముఖ్యతను ఆవిష్కరిస్తున్నాయి. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి కెమెరా: రత్నవేలు, సంగీతం: ఏఆర్ రెహమాన్, సమర్పణ: మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాణం: వృద్ధి సినిమాస్.



# గంగానదిలో అండర్ వాటర్ సీక్వెన్స్?

అగ్ర హీరో మహేశ్‌బాబు, దిగ్దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' చిత్రం దేశంలో రూపొందుతున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీస్‌లో మొదటి స్థానంలో ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమాలోని భారీ అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ని కాశీలో చిత్రీకరిస్తున్నారు దర్శకుడు రాజమౌళి. నిజానికి ఈ సన్నివేశాలను హైదరాబాద్‌లోనే షూట్ చేయాలనుకున్నారాయన. గగన్‌పహాడ్ పరిసరాల్లో ఇందుకోసం ఓ భారీ కొలను కూడా నిర్మించారు. దీనికోసం దాదాపు 150 ట్యాంకర్ల నీళ్లు అవసరం కావడంతో జలమండలికి నిర్మాతలు లేఖ రాశారు. వేసవి కావడం చేత అంత నీరు ఇవ్వలేమంటూ ప్రభుత్వం 'వారణాసి' యూనిట్‌కి షాకిచ్చింది. దాంతో షూటింగ్‌ని కాశీకి షిఫ్ట్ చేశారు రాజమౌళి. అక్కడి గంగానదిలోనే అండర్ వాటర్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ సీక్వెన్స్ సినిమా హైలైట్స్‌లో ఒకటిగా నిలుస్తుందని సమాచారం.వీశీజఅవం ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్ర పోషిస్తున్న విషయం విదితమే. ఈ చిత్రానికి కథ: వి.విజయేంద్రప్రసాద్, ఎస్ఎస్ కాంచి, మాటలు: దేవ కట్టా, కెమెరా: పీఎస్ విందా, సంగీతం: ఎంఎం కీరవాణి, నిర్మాతలు: కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ, నిర్మాణం: శ్రీదుర్గా ఆర్ట్స్.



# 'పెద్ది' ప్రమోషన్లకు జాన్వీ దూరం .. ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారిన ప్రచారం!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ లెజెండరీ నటి శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఇప్పటివరకు భారీ కమర్షియల్ విజయాన్ని మాత్రం అందుకోలేకపోయింది. బాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటించిన జాన్వీ, ఇప్పుడు తన ఫోకస్‌ను తెలుగు సినిమాలపై ఎక్కువగా కేంద్రీకరిస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ పెద్ది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ భారీ పాన్ ఇండియా స్పోర్ట్స్ డ్రామాలో జాన్వీ గ్రామీణ యువతిగా కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్‌లలో ఆమె లుక్‌కు మంచి స్పందన లభించింది. అయితే ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా ఓ ప్రముఖ దినపత్రిక ప్రచురించిన కథనం ప్రకారం, జాన్వీ కపూర్ 'పెద్ది' ప్రమోషన్లకు పూర్తిగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుందనే ప్రచారం జరుగుతోంది. భారీ రెమ్యూనరేషన్ కారణంగానే ఆమె ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించిందని, సినిమాలో తన పాత్రకు అంత ప్రాధాన్యత లేదనే భావనతో ప్రమోషన్లలో పాల్గొనాలనే ఆసక్తి చూపడం లేదని ఆ కథనం పేర్కొంది. అయితే ఈ వార్తలపై చిత్ర యూనిట్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఈ ప్రచారం నిజమైతే, అది జాన్వీ కెరీర్‌పై ప్రభావం చూపే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఎందుకంటే 'పెద్ది' వంటి భారీ పాన్ ఇండియా చిత్రంతో ఆమెకు దక్షిణాదిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా మరింత గుర్తింపు దక్కే అవకాశం ఉంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకుల్లో బలమైన మార్కెట్‌ను సంపాదించుకోవడానికి ఈ సినిమా కీలకంగా మారనుంది. ప్రస్తుతం జాన్వీ చేతిలో పెద్దగా హై-ప్రొఫైల్ ప్రాజెక్టులు లేని నేపథ్యంలో, 'పెద్ది' విజయం ఆమెకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టే అవకాశముంది. అందుకే ఈ సినిమా ప్రమోషన్లలో చురుకుగా పాల్గొనడం ఆమె కెరీర్‌కు ప్లస్ అవుతుందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా రిలీజ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ హైప్ మరింత పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జాన్వీ చివరకు ప్రమోషన్లలో పాల్గొంటుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

# ఐరాసలో సంస్కరణలు చేపట్టాలి

ఐక్యరాజ్యసమితితో సహా ప్రపంచ పాలనా సంస్థల్లో అత్యవసర సంస్కరణలు చేపట్టాలని, బహుళపక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. దిల్లీలో శుక్రవారం జరిగిన బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో 'ప్రపంచ పాలన, బహుళపక్ష వ్యవస్థ సంస్కరణలు' అనే అంశంపై సెషన్ నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన జైశంకర్, ఐక్యరాజ్యసమితి మరింత ప్రభా వవంతంగా పనిచేయాలంటే, భద్రతా మండలిని విస్తరిం చడంతో పాటు, సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ స్థాయి సంస్థలు కాలం చెల్లిన నిబంధనలతో పనిచేస్తున్నాయని, అందువల్ల అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య వ్యవస్థల పునర్నిర్మాణాన్ని భారత్ కోరుకుం టోందని ఆయన అన్నారు. ఈ సమావేశం తర్వాత జైశంకర్ ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. అందులో పరస్పరం అనుసంధానమైన నేటి బహుళ-ధృవ ప్రపంచంలో 'నమ్మకమైన, సంస్కరణలతో కూడిన బహుళపక్ష విధానం' అత్యవసరం అని, బ్రిక్స్ సమావేశంలో దీనిపైనే ప్రధానంగా చర్చించామని అన్నారు. "ప్రస్తుత కాలం ఇస్తున్న సందేశం చాలా స్పష్టం. సహకారం, చర్చలు జరపడం చాలా అవసరం. ఇప్పటికే సంస్కరణలు చేపట్టడం చాలా ఆలస్యమైంది. అందువల్ల ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్య పెంచాలి. లేకుంటే ఐరాస ప్రభావం, విశ్వసనీయత చాలా పరిమితంగా ఉండిపోయే అవకాశం ఉంది." ఇక ఐరాస సంస్కరణలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు రాత పూర్వక చర్చలు (టెక్స్ట్ బేస్డ్ నెగోసియేషన్స్) తక్షణమే ప్రారంభం కావాలని జైశంకర్ పేర్కొన్నారు. అలాగే బహుళపక్ష అభివృద్ధి బ్యాంకులను మరింత బాధ్యతాయుతంగా, మరింత బలంగా మార్చాల న్నారు. ఇందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నిర్మాణంలో అత్యవసర మార్పులు అవసరమని పేర్కొన్నారు. అలాగే వాతావరణ నిధులు (క్లైమేట్ ఫైనాన్స్), అభివృద్ధి నిధుల లభ్యతను పెంచాలని జైశంకర్ కోరారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) కేంద్రంగా పనిచేసే 'నిబంధనలకు కట్టుబ డి, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, అందరినీ కలుపుకు పోయే అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ' ఉండాలని అన్నారు.



### అరాగ్చీతో చర్చలు

బ్రిక్స్ సమావేశాల మధ్యలోనే ఇరాన్? విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్? అరాగ్చీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అరాగ్చీ మాట్లాడుతూ, భారత్? అధ్యక్షతన బ్రిక్స్ సభ్య దేశాల మధ్య మరింత సమన్వయం, విజయాలు సాధించగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికాతో జరిగిన యుద్ధం, కాల్పుల విరమణ పరిస్థితులు, వివాదాన్ని ముగించేందుకు జరుగుతున్న చర్చల వివరాలను ఆయన జైశంకర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు హర్మూజ్ జలసంధిలోని తాజా పరిణామాలు, సముద్ర భద్రత, ప్రాంతీయ స్థిరత్వంపై తమతమ అభిప్రాయాలు పంచుకున్నారు.

### ఇరాన్‌తో స్నేహం

ఈ సందర్భంగా జైశంకర్ మాట్లాడుతూ, అంతర్జాతీయ వివాదాలకు దౌత్యపరమైన పరిష్కారాలు కనుగొనాలని, వాటికే భారత్ మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. భారత్-ఇరాన్ మధ్య ఎప్పుడూ స్నేహపూర్వక సంబంధాలు ఉంటాయని పేర్కొన్నారు.

### ద్వంద్వ విధానాలపై ఇరాన్ ఆగ్రహం

బ్రిక్స్ సమావేశం రెండో రోజున ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ, ఇరాన్‌లోని పౌరులపై, మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. పౌరులపై దాడులను అంతర్జాతీయ సమాజం ఖండించాలని, ద్వంద్వ విధానాలను వీడాలని ఆయన కోరారు. 'మినాబ్?లో ఒక చిన్నారి ప్రాణం కూడా, ప్రపంచంలో మరెక్కడైనా ఉండే చిన్నారి ప్రాణంతో సమానమని నిరూపించాలి' అని అన్నారు. ఐరాస భద్రతా మండలి సంస్కరణ అనేది ఒక ఐచ్ఛికం కాదు, అది ఐరాస మనుగడకే అత్యంత అవసరమని అరాగ్చీ స్పష్టం చేశారు. "ప్రపంచంలోని అన్ని ఖండాలు, ప్రాంతాలకు నిజమైన ప్రాతినిధ్యం వహించే కౌన్సిల్ మాకు కావాలి. అధికారం కేవలం కొద్ది మంది దుర్వినియోగ, దురాక్రమణ శక్తుల ప్రయోజనాల కోసమే కాకుండా, బాధ్యతాయుతంగా, సమానంగా పంపిణీ చేయబడే మండలి మాకు కావాలి" అని ఆయన అన్నారు. ఈ నిజమైన బహుళపక్ష విధానానికి బ్రిక్స్? కూటమి ఒక వెన్నెముకగా మారగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు

సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. ఆన్‌లైన్ విచారణ కోసం లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ సమయంలో సాంకేతిక అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు సీజేఐ సహా ఇతర న్యాయమూర్తులు కార్ పూలింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రిజిస్ట్రీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతం మందికి వారంలో రెండ్రోజుల పాటు వర్క్ ఫ్రం హోం విధానాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇందుకోసం వీక్లీ రోస్టర్‌ను తయారు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇళ్ల నుంచి పనిచేసే వారు ఎల్లప్పుడూ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండాలని, అవసరమైతే వెంటనే కార్యాలయానికి రావాల్సి ఉంటుందని తెలిపింది. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా నిర్ధారించుకోవాలని రిజిస్ట్రీకి సూచించింది. అయితే, వర్క్? ఫ్రం హోమ్ సమర్థవంతంగా లేదని సంబంధిత రిజిస్ట్రార్ అభిప్రాయపడితే, ఆయా శాఖ లేదా విభాగానికి అటువంటి



ఏర్పాట్లను పరిమితం చేయవచ్చు లేదా సవరించవచ్చునని సర్క్యులర్?లో పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్యలు చేపట్టింది.

### ఇంధన సంక్షోభంపై మోదీ సూచనలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో భవిష్యత్?లో దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ఇంధనం పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్?కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఏడాది పాటు బంగారం కొనవద్దని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. చిన్న చిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చునని అన్నారు.

### ప్రధాని పిలుపునకు విశేష స్పందన

అయితే, ప్రధాని మోదీ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నారు. తాజాగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రజా రవాణాకు ప్రాధాన్యమిచ్చి, కాన్వాయ్‌ని వాడకుండా రైలులో ప్రయాణించి కురుక్షేత్రకు వెళ్లారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ తొక్కుతూ గురుకుల్ చేరుకున్నారు. ఆయన భద్రతా సిబ్బంది సైతం సైకిల్‌పైనే గవర్నర్‌ను అనుసరిస్తూ తమ విధులను నిర్వర్తించారు.

### దిల్లీలో వర్క్ ఫ్రం హోమ్

మరోవైపు, దిల్లీ ప్రభుత్వం కూడా ఇప్పటికే అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది. సీఎం, మంత్రుల కాన్వాయ్‌ని సగానికిపైగా తగ్గించింది. మరోవైపు, ఇంధన ధరల పెంపుపై విపక్షాలు విరుచుకుపడ్డాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ తన వసూళ్లు ప్రారంభించారంటూ ఆరోపించాయి. పెట్రోల్, డీజిల్, గ్యాస్?పై పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశాయి. అయితే, ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయని ముందుగానే ఊహించామని తృణమూల్ కాంగ్రెస్ దుయ్యబట్టింది.

# మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు

పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మోదీ సర్కార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం చేసిన తప్పునకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోయాయి. దీనితో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలు ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపైకి నెట్టాయి. దీనితో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.3 చొప్పున పెరిగాయి. గత నాలుగేళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలంలో ఇంధన ధరలు పెరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అయితే దీనిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్? గాంధీ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "మోదీ ప్రభుత్వం తప్పు చేసింది. ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.3 పెంచి షాక్ ఇచ్చారు. మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయి."

### సీఎన్‌జీ ధరలు కూడా పెరిగాయ్

మరోవైపు దిల్లీ, ముంబయి లాంటి నగరాల్లో సీఎన్?జీ ధరలు కూడా కిలోకు రూ.2 చొప్పున పెంచారు. పరిశ్రమ వర్గాల ప్రకారం, దిల్లీలో పెట్రోల్ ధర లీటర్?కు రూ.94.77 నుంచి రూ.97.77కు పెరిగింది. లీటర్? డీజిల్ ధర రూ.87.67 నుంచి ఇప్పుడు రూ.90.67కు చేరింది. అయితే రాష్ట్రాలు విధించే 'విలువ ఆధారిత పన్ను'లో ఉన్న వ్యత్యాసాల కారణంగా ఈ ధరలు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయి. తర్వాత ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగి, హర్మూజ్ జలసంధిని దిగ్బంధనం




చేసింది. దీనితో అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ గుండా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్లో ముడిచమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి.

అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతలు వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశీయ ఇంధన సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా చూసింది. అయితే నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందువల్లనే కేంద్రం ఇంధన ధరలు పెంచలేదని, దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయని, అప్పట్లోనే ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీని తర్వాత బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురువేసి, ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. బంగాల్‌లో అయితే మొదటిసారి కాషాయపార్టీ తన జెండాను పాతగలిగింది.

అయితే విపక్షాలు అన్నట్లుగానే, అసెంబ్లీ ఎన్నికలు అయిన తర్వాత మోదీ సర్కార్, ఇంధన ధరలు పెంపు నిర్ణయం తీసుకుంది. దీనితో 2022 మే తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు అత్యంత గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

### రూ.3 పెంపు సరిపోతుందా?

తాజాగా పెంచిన ధరలు చాలా మంది భారతీయులకు భారంగా మారాయన్నది వాస్తవం. అయితే లీటర్? పెట్రోల్, డీజిల్?పై రూ.3 పెంపు అనేది చాలా ఎక్కువగా అనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఆయిల్? మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) భరిస్తున్న నష్టాన్ని తీర్చలేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు ఓఎంసీలు మంచి లాభాల్లో ఉన్నాయి. కానీ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ నష్టాలను భరిస్తూ వస్తోంది. ఈ యుద్ధం ఇంకొన్నాళ్లు కొనసాగితే, ప్రతి కంపెనీ తీవ్రమైన నష్టాలకు, ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. నిపుణుల ప్రకారం, యుద్ధానికి ముందు బ్యారెల్ ముడిచమురు ధర సగటున 69 డాలర్లుగా ఉండగా, ఈ ఏప్రిల్?లో సగటున 114.48 డాలర్లకు, మే నెలలో ఇప్పటి వరకు సగటున 105.87 డాలర్లకు చేరుకుంది. దీని వల్ల ఓఎంసీలు భారీగా నష్టపోతున్నాయి. ఈ భారీ నష్టాలను పూడ్చుకోవాలంటే, లీటర్? పెట్రోల్ ధర రూ.28లు, లీటర్ డీజిల్ ధర రూ.33 వరకు పెంచితేకాని ఏఎంసీలకు బెనిఫిట్ ఉండదు. అయితే ప్రస్తుత భారత రాజకీయ వాతావరణంలో, ఇంతటి భారీ స్థాయిలో ఇంధన ధరలు పెంచడం సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

## నీట్ పేపర్ లీక్ కేసు ప్రధాన నిందితుడు అరెస్ట్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఒక ప్రొఫెసర్‌ను పుణెలో కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ) శుక్రవారం అరెస్టు చేసింది. 'మహారాష్ట్రలోని లాతూరు ప్రాంతానికి చెందిన ప్రొఫెసర్ పీవీ కులకర్ణి రసాయన శాస్త్రంలో నిపుణుడు. ఆయన గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం పుణెలో నివసిస్తున్నారు. నీట్ ప్రశ్నపత్రాలను చూడడానికి ఆయనకు యాక్సెస్ ఉంది. అయినప్పటికీ ఆయన తన సొంత ఇంటిలోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు నిర్వహించినట్లు సీబీఐ దర్యాప్తులో తెలిసింది' అని సీబీఐ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై ఓ ఉన్నతాధికారి మాట్లాడుతూ, "ఈ కేసులో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సాయంతో ప్రొఫెసర్ కులకర్ణి 2026 ఏప్రిల్ చివరి వారంలో పెద్ద ఎత్తున విద్యార్థులను సమీకరించి, తన కోచింగ్ సెంటర్‌లో చేర్చుకున్నారు. తరువాత నీట్-యూజీ పరీక్షలో వచ్చే ప్రశ్నలను, వాటి ఆప్షన్లను, సరైన సమాధానాలను స్వయంగా డిక్టేట్ చేశారు. ఆయన చెప్పిన ప్రశ్నలను విద్యార్థులు తమ నోట్‌బుక్స్‌లో చేతిరాతతో రాసుకున్నారు. మే 3వ తేదీన జరిగిన నీట్-యూజీ అసలు పరీక్ష పత్రంతో ఈ నోట్స్ అచ్చుగుద్దినట్లు సరిపోలింది" అని పేర్కొన్నారు. కాగా, మనీషా వాఘ్మారేను సీబీఐ మే 14న అరెస్టు చేసింది.

## ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ

ఐదు దేశాల పర్యటన నిమిత్తం భారత ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అబుదాబి బయలుదేరారు. మే 15-20 వరకు యూఏఈ, నెదర్లాండ్స్, స్వీడన్, నార్వే, ఇటలీ దేశాల్లో పర్యటించనున్నారు. ఆయా దేశాలతో వాణిజ్యం, సాంకేతికత, ఇంధనం, ఆవిష్కరణలు, హరిత వృద్ధి వంటి రంగాలలో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు చర్చలు జరపనున్నారు. అలాగే యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో భారత్ సంబంధాలను మరింత పటిష్ఠం చేయనున్నారు. ఆరు రోజుల పాటు ప్రధాని మోదీ విదేశాల్లో పర్యటించనున్నారు.

### యూఏఈతో పర్యటనతో స్టార్ట్

ప్రధాని మోదీ మే 15న యూఏఈ పర్యటనతో తన విదేశీ యాత్రను ప్రారంభిస్తారు. అక్కడ యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను కలుస్తారు. నెహ్యాన్‌తో ఇంధన సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రాంతీయ సమస్యలపై చర్చిస్తారు. యూరప్ పర్యటనకు ముందు మోదీ యూఏఈలో నాలుగు గంటలు యూఏఈలో గడుపుతారు.

### నెదర్లాండ్స్ ప్రధానితో భేటీ

యూఏఈ పర్యటన తర్వాత మోదీ మే 15-17 తేదీలలో నెదర్లాండ్స్‌లో పర్యటిస్తారు. అక్కడ నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌తో చర్చలు జరపడంతో పాటు, కింగ్ విల్లెం అలెగ్జాండర్, క్వీన్ మాక్సిమాలను కలవనున్నారు. ఈ పర్యటనలో సెమీ కండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఆవిష్కరణలు, రక్షణ రంగం, నీటి నిర్వహణ వంటి రంగాలపై ప్రధాని మోదీ దృష్టి సారించే అవకాశం ఉంది. 2017 తర్వాత మోదీ నెదర్లాండ్స్‌లో పర్యటించడం ఇది రెండోసారి.

### స్వీడన్‌లో రెండు రోజులు మకాం

మే 17-18 తేదీలలో ప్రధాని మోదీ స్వీడన్‌లో పర్యటించనున్నారు. ఆ దేశ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్‌సన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌తో కలిసి ఇరు దేశాధినేతలు యూరోపియన్ రౌండ్ టేబుల్ ఫర్ ఇండస్ట్రీలో సంయుక్తంగా ప్రసంగించే అవకాశం ఉంది. అలాగే ఏఐ, వర్ధమాన సాంకేతికతలు వంటి వాటిపై చర్చలు జరిగే అవకాశం ఉంది.

### నార్వే ప్రధానితో ద్వైపాక్షిక చర్చలు

మే 19న నార్వేలోని ఓస్లోలో జరగబోయే మూడో భారత్-నార్డిక్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. అనంతరం నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్, స్వీడన్ దేశాల నాయకులు కూడా పాల్గొంటారు. మే 19-20 తేదీలలో ఇటలీలో పర్యటించనున్నారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోని, ఆ దేశ అధ్యక్షుడు సెర్గియో మట్టారెల్లాలతో మోదీ చర్చలు జరపనున్నారు. స్వచ్ఛ ఇంధనం, రక్షణ, సాంకేతిక రంగాలలో భారత్-ఇటలీ సహకారం పెరుగుతున్న నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

### మోదీ పర్యటనపై యూఈఏ ఏమందంటే?

అలాగే తమ దేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటించడంపై యూఏఈ అంతర్జాతీయ సహకార శాఖ సహాయ మంత్రి రీమ్ అల్ హషిమీ స్పందించారు. వాణిజ్యం, సాంకేతికతలో భారత్, యూఏఈ ద్వైపాక్షిక సంబంధాలు కొత్త శిఖరాలను అధిరోహిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ పర్యటన పట్ల తాము ఎంతో ఉత్సాహంగా ఉన్నామని చెప్పారు. ఇరు దేశాల సుదీర్ఘ భాగస్వామ్యంలో ప్రధాని మోదీ ఒక కీలక వ్యక్తిగా ఉన్నారని కొనియాడారు.

### ఈ టూర్ భారత్‌కు చాలా కీలకం : ఫియో

ప్రధాని ఐదు దేశాల పర్యటనకు ముందు భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) కీలక వ్యాఖ్యలు చేసింది. మోదీ ఈ పర్యటన ఒక కీలకమైన తరుణంలో జరుగుతోందని అభిప్రాయపడింది. ఇది యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో దేశ వాణిజ్య, పెట్టుబడి సంబంధాలకు కొత్త ఊపునిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపింది. యూరప్, గల్ఫ్ ప్రాంతాలతో భారతదేశ ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలకు ఈ పర్యటన చాలా ముఖ్యమైనదని పేర్కొంది. ఇంజినీరింగ్, స్వచ్ఛ ఇంధనం, టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డిజిటల్ ట్రేడ్ వంటి రంగాలలో భారతీయ ఎగుమతిదారులకు ఈ ఉన్నత స్థాయి సమావేశాలు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని భావిస్తున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఫియో అధ్యక్షుడు ఎస్‌సీ రల్హాన్ వ్యాఖ్యానించారు. "యూఏఈ, ఈయూ దేశాల నాయకులతో ప్రధాని మోదీ జరిపే ఉన్నత స్థాయి సమావేశాలు విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా, ప్రపంచ వృద్ధికి కీలక చోదకంగా భారత్ పెరుగుతున్న స్థాయిని నొక్కి చెబుతున్నాయి. ఇంజినీరింగ్, స్వచ్ఛ ఇంధనం, టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టెక్స్‌టైల్స్, లాజిస్టిక్స్, డిజిటల్ ట్రేడ్‌తో సహా పలు రంగాలలో భారతీయ ఎగుమతిదారులకు ఈ పర్యటన గణనీయమైన అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నాం. భారత్, నార్వే దేశాల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సమన్వయం సుస్థిర, హరిత వృద్ధి దిశగా సాగుతోంది. ఇది భారతీయ వ్యాపారాలు, స్టార్టప్‌లు, సాంకేతిక భాగస్వామ్యాలకు కొత్త ద్వారాలను తెరుస్తుంది. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, భారత్-ఈఎఫ్‌టీఏ వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (టీఈపీఏ) ఇటీవలే కుదిరిన నేపథ్యంలో యూరప్‌లో ప్రధాని మోదీ పర్యటించడంతో ఈ టూర్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. యూఏఈ భారతదేశానికి అత్యంత ముఖ్యమైన వాణిజ్య, పెట్టుబడి భాగస్వాములలో ఒకటి. అలాగే పశ్చిమాసియా, ఆఫ్రికాకు భారతీయ ఎగుమతులకు కీలకమైన ముఖద్వారంగా కొనసాగుతోంది. మోదీ యూఏఈ పర్యటన ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తుంది. యూఏఈలో ఉన్న ప్రవాస భారతీయులు కూడా ఇరుదేశాల మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో వారధిగా పనిచేస్తున్నారు" అని ఎస్‌సీ రల్హాన్ పేర్కొన్నారు.

## కుల వ్యవస్థను నిర్మూలించాలన్నదే నా వ్యాఖ్యల ఉద్దేశం

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్న వేళ తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, నటుడు ఉదయనిధి స్టాలిన్ వివరణ ఇచ్చారు. తన వ్యాఖ్యలను వక్రీకరిస్తున్నారని, ప్రజలను అగ్ర, నిమ్న కులాల పేరుతో విభజించే వ్యవస్థను మాత్రమే నిర్మూలించాలన్నది తన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎవరూ ఆలయాలకు వెళ్లొద్దు అని చెప్పడం తన ఉద్దేశం కాదని వివరించారు. ఆలయాలతో పాటు సమాజంలో ప్రతీ ఒక్కరికీ సమాన హక్కులు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఎవరెన్ని విమర్శలు చేసినా తాను భయపడే వ్యక్తిని కాదని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడుతుంటానని ఉదయనిధి స్టాలిన్ చెప్పారు. పెరియార్, అంబేద్కర్, అన్నా, కళైంగర్ సిద్ధాంతాల గురించి కూడా తాను అసెంబ్లీలో మాట్లాడానని తెలిపారు. దేవుడిపై ఉండే నమ్మకానికి తాము వ్యతిరేకం కాదన్న ఉదయనిధి, అసమానతలను, అణచివేతను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని అన్నారు. కాగా మంగళవారం అసెంబ్లీలో సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉధయనిధి వ్యాఖ్యానించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137